FOR ADS.......
ఆకాంక్ష
CONTACT:
8333818121

తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
ఆకాంక్ష

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :206 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజీలు : 08, వెల. 5రూ/ గురువారం- 19 - మార్చి - 2026

# దేశ నలుమూలలా శ్రీవారి వైభవం



ముంబయి ఆలయానికి రూ.5.12 కోట్లతో స్వర్ణ కవచాలు
దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో వేంకటేశ్వరస్వామి గుడుల నిర్మాణానికి టీటీడీ ముమ్మర సన్నాహాలు
ఇప్పటికే పలు రాష్ట్రాల్లో స్థలాల కేటాయింపు- నవీ ముంబయిలో జూన్ నాటికి ఆలయం ప్రారంభం

అమరావతి : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వైభవం దేశ నలుమూలలా విస్తరిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలు, రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మిగతా..2లో

# మూసీ ప్రాజెక్టు రూ.1.5 లక్షల కోట్ల స్కామ్: కేటీఆర్



తెలంగాణ ప్రభుత్వం ఏకంగా రూ.1.5 లక్షల కోట్ల భారీ ఆర్థిక కుంభకోణానికి తెరలేపిందని
ప్రభుత్వ వైఖరిలో పారదర్శకత లేదని నిరసిస్తూ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు.

హైదరాబాద్: మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పేరుతో తెలంగాణ ప్రభుత్వం ఏకంగా రూ.1.5 లక్షల కోట్ల భారీ ఆర్థిక కుంభకోణానికి తెరలేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై శాసనసభలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మిగతా..2లో

## ఇకపై ఆ ఇంక్రిమెంట్ రద్దు..
# టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం



- ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులకు సంబంధించి యాజమాన్యం షాకింగ్ నిర్ణయం తీసుకుంది.
- ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద ఇచ్చే స్పెషల్ ఇంక్రిమెంట్‌ను రద్దు చేస్తూ సర్క్యులర్ జారీ అయ్యింది.

హైదరాబాద్, మార్చి 18: ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బిగ్ షాక్ ఇచ్చింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద ఇచ్చే స్పెషల్ ఇంక్రిమెంట్‌ను రద్దు చేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది.

## మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసుపై
# స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

- మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు.
- ఏపీ ఎంపీ పుట్టా మహేశ్‌కు నిబంధనల మేరకు స్టేషన్ బెయిల్ వచ్చిందని తెలిపారు.
- చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు ముందుగానే వస్తే సంతోషిస్తామని అన్నారు.



హైదరాబాద్: మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. ఈ కేసులో అరెస్టైన వారిలో ఎనిమిది మందికి నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్ వచ్చిందని తెలిపారు. ఇందులో ముఖ్యమంత్రిగా తన ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. ఈ కేసును దర్యాప్తు చేయడానికి ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేశామని అన్నారు. ఏపీ ఎంపీ పుట్టా మహేశ్‌కు నిబంధనల మేరకు స్టేషన్ బెయిల్ వచ్చిందని తెలిపారు. 2028లో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు రాబోవని జోస్యం చెప్పారు. 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయని అన్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు ముందుగానే వస్తే సంతోషిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతకుముందు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఇతర నాయకులతో కలిసి ఆయన అధిష్ఠానం పెద్దలతో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు పరిచయం చేశారు.

## గిరిజనుల అస్థిత్వాన్ని
# దెబ్బతీస్తున్నారు
## మంత్రి సీతక్క మండిపాటు

ఆదివాసీ ప్రాంతాల సహజ వనరులపై బీజేపీ కేంద్ర ప్రభుత్వం చూపుతున్న ఆసక్తి, ఆ ప్రాంతాల ప్రజల అభివృద్ధిపై మాత్రం కనిపించడం లేదని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు..



హైదరాబాద్: ఆదివాసీ ప్రాంతాల సహజ వనరులపై బీజేపీ కేంద్ర ప్రభుత్వం చూపుతున్న ఆసక్తి, ఆ ప్రాంతాల ప్రజల అభివృద్ధిపై మాత్రం కనిపించడం లేదని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఖనిజ సంపద, అటవీ వనరుల పై ఉన్న శ్రద్ధ అక్కడి ఆదివాసీలపై లేదని మండిపడ్డారు. గ్రామ స్వయం పాలనకు కీలకమైన గ్రామ సభలను, పెసా చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభల అనుమతి లేకుండా అనేక ప్రాజెక్టులను అమలు చేయడం ద్వారా మిగతా..2లో

## 40 సెకన్లలో 64 పుషప్స్- రెండు బొటనవేళ్లపై ఈ ఫీట్ సాధించిన 'విక్కీ'
# వరల్డ్ రికార్డ్ సొంతం




- పుషప్స్ తీయడంలో రికార్డు సృష్టించిన పంజాబ్ చెందిన యువకుడు
- 40 సెకన్ల వ్యవధిలో 64 పుషప్స్- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

ఢిల్లీ : జీవితంలో ఏదైనా సాధించాలంటే కఠోరమైన శ్రమ, ఫ్యాషన్, అంకితభావం ఉండాలి. అలాంటప్పుడే అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయొచ్చు. అచ్చం ఇదే విషయాన్ని నిజం చేసి చూపించారు పంజాబ్‌లోని సుల్తాన్‌పుర్

## ఈడీ సోదాలను సీఎం అడ్డుకోవడం సరికాదు
# సీఎం మమతపై సుప్రీంకోర్టు అసహనం

- ఈడీ సోదాలు మమత అడ్డుకోవడాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు
- అది హర్షించదగిన పరిణామం కాదని వ్యాఖ్య



ఢిల్లీ : బంగాల్ సీఎం మమతా బెనర్జీపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. జనవరి 8న కోల్‌కతాలోని ఐప్యాక్ కార్యాలయంలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలను సీఎం మమత అడ్డుకొని, అంతరాయం కలిగించడాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. అది హర్షించదగిన పరిణామం కాదని న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంపై ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు వింటూ భారత సర్వోన్నత న్యాయస్థానం ఈ కామెంట్స్ చేసింది. ఈ విధమైన అసాధారణ పరిస్థితుల్లో ఈడీ సోదాలకు, విధి నిర్వహణకు ఆటంకం కలిగితే, దానికి ఒక రాజ్యాంగపరమైన పరిష్కారం అనేది లేని పరిస్థితి ఉండకూడదని బెంచ్ పేర్కొంది. ఒకవేళ భవిష్యత్తులో ఈడీ సోదాలకు వేరొక ముఖ్యమంత్రి అడ్డుతగిలితే పరిస్థితేంటి? ఈడీ ఎలాంటి రాజ్యాంగపరమైన పరిష్కారానికి నోచుకోకుండానే ఉండిపోవాలా? అని ధర్మాసనం ప్రశ్నించింది.

**సీఎం మమత, అధికారులపై కేసులు నమోదుచేయాలి: ఈడీ**

ఎన్నికల సలహాలను అందించే ఐప్యాక్ సంస్థ చీఫ్ ప్రతీక్ జైన్ కోల్‌కతా నివాసంలో మిగతా..2లో

## రాజకీయాల్లో విరమణ అంటూ ఉండదు'
# రాజ్యసభలో ప్రధాని మోదీ

- పదవీవిరమణ చేసిన ఎంపీలు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపు
- దేవెగౌడ, పవార్ నుంచి కొత్తగా ఎన్నికైన ఎంపీలు పాఠాలు నేర్చుకోవాలని ప్రధాని మోదీ సూచన




ఢిల్లీ : రాజకీయాల్లో విరమణ అంటూ ఏమి ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. రాజ్యసభలో పదవీకాలం ముగిసిన సభ్యులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ, పదవీవిరమణ చేసిన సభ్యులు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. సభ నుంచి వెళ్లేవారు కొత్తగా వచ్చేవారికి స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. సభలో చర్చలు జరిగేటప్పుడు ఎన్నో రకాలు వాదనలు జరుగుతాయన్న మోదీ, ప్రజా ప్రయోజనాల పరిరక్షణే వాటి అంతిమ లక్ష్యమన్నారు. "సభలో వివిధ అంశాలపై చర్చలు జరుగుతాయి. వాటిలో ప్రతి సభ్యుడు ఒక ప్రత్యేక పాత్ర పోషిస్తారు. కొన్ని మంచితో పాటు చెడు అనుభవాలు ఎదురవుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లోనే పార్టీలకతీతంగా అందరిలో పరస్పర గౌరవ భావం ఏర్పడుతుంది. తమ పదవీ కాలం ముగిసి సభను వీడుతున్న సభ్యులకు నేను ఒక్కటి చెప్పాలనుకుంటున్నా. రాజకీయాల్లో ఎప్పుడు ముగింపు ఉండదు. మీ అనుభవాలు, మీ సేవలను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది.'

## విశాఖ రైల్వేజోన్ కార్యకలాపాలు
# త్వరలో ప్రారంభం



- విశాఖపట్నం రైల్వేజోన్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.
- వైజాగ్‌లోని ముడసర్లోవ వద్ద 52.2 ఎకరాల భూమిని ఆగస్టు 2024లో రాష్ట్ర ప్రభుత్వం రైల్వే శాఖకు అప్పగించిందని ప్రస్తావించారు.

## పోలవరం నిర్వాసితులతో సీఎం చంద్రబాబు సమావేశం
# రూ.226 కోట్ల చెక్కు అందజేత

- పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులతో సీఎం చంద్రబాబు సమావేశం
- రూ.226 కోట్ల చెక్కు అందజేత అందించిన సీఎం
- పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిధులు



అమరావతి : వచ్చే ఉగాది తర్వాత 2 నెలల్లోనే పోలవరం ప్రాజెక్టు పూర్తై మన అందరి కల సాకారం అవుతుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో నిబద్ధతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేస్తోందని వివరించారు. గత పాలనలో జరిగిన తప్పులు సరిదిద్దుతూ లబ్ధిదారులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని చెప్పిన సీఎం పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును అందజేశారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో పోలవరం ప్రాజెక్టులోని వివిధ ముంపు గ్రామాల నిర్వాసితులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మిగతా..2లో

## దివ్యాంగులతో కలిసి భోజనం చేసిన
# మంత్రి నారా లోకేశ్



- మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించారు.
- "కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే డీఎస్సీ ద్వారా 16వేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేశాం.

మొదటి పేజి తరువాయి

## విశాఖ రైల్వేజోన్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభం

ఢిల్లీ, మార్చి 18 : విశాఖపట్నం రైల్వేజోన్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. ఈరోజు(బుధవారం) లోక్‌సభలో ఆయన మాట్లాడారు. వైజాగ్‌లోని ముడసర్లోవ వద్ద 52.2 ఎకరాల భూమిని ఆగస్టు 2024లో ఏపీ ప్రభుత్వం రైల్వేశాఖకు అప్పగించిందని ప్రస్తావించారు. సౌత్ కోస్ట్ రైల్వేజోన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి రూ.106.89 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. 2025 జనవరిలో ఈ జోన్‌కు శంకుస్థాపన జరిగిందని.. ప్రస్తుతం ప్రధాన కార్యాలయ భవన పునాది పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. జోన్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఎవీ=ణూ భవనం 'ది డెక్' సిద్ధమైందని అన్నారు. త్వరలోనే అక్కడి నుంచే పాలన జరుగుతుందని చెప్పుకొచ్చారు.

### ఉన్నతాధికారుల నియామకం..

రైల్వేజోన్ కోసం జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకం పూర్తి చేస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 2009-2014 మధ్య సగటున రూ. 886 కోట్లు ఉంటే, 2025- 26లో ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో రూ.9,417 కోట్ల కేటాయింపులు జరిగాయని స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే రైల్వేట్రాక్ నిర్మాణ వేగం రెట్టింపు అయిందని వివరించారు. ప్రతి ఏటా సగటున 143 కిలోమీటర్ల మేర కొత్త ట్రాక్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఎర్రుపాలెం - అమరావతి - నంబూరు కొత్త రైల్వేలైన్ (57 కిలోమీటర్ల) కోసం రూ. 2047 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఏపీలో ప్రస్తుతం రూ. 70,232 కోట్ల విలువైన 39 రైల్వే ప్రాజెక్టులు (కొత్త లైన్లు, డబ్లింగ్) పనులు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. విజయవాడ - గూడూరు మూడవ రైల్వేలైన్, గుంతకల్ - గుంటూరు డబ్లింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

## ఇకపై ఆ ఇంక్రిమెంట్ రద్దు.. టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం

ఆర్టీసీ బోర్డు తీర్మానం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇకపై ఉద్యోగులు, వారి జీవిత భాగస్వామి.. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నా ఈ ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వబోమని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ సర్క్యులర్ జారీ చేసింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద స్పెషల్ క్యాజువల్ లీవ్ మాత్రమే కొనసాగుతుందని తెలిపింది. ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

## గిరిజనుల అస్థిత్వాన్ని దెబ్బతీస్తున్నారు

ఆదివాసీల హక్కులను హరిస్తోందని ఆమె ఆరోపించారు. ఆదివాసీల హక్కులు, అభివృద్ధి, స్వాభిమానాన్ని కాపాడటం కోసం ఆందోళనకు కాంగ్రెస్ సిద్దమని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో లోక్ సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, ఆదివాసి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు విక్రాంత్ భూరియా అధ్వర్యంలో బుధవారం ఏఐసీసీ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి సీతక్క పాల్గొని ప్రసంగించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులని, వారి జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు దేశ సంపదలో అంతర్భాగమని పేర్కొన్నారు. అందుకే తొలి ప్రధాని నెహ్రూ హయం నుంచి మన్మోహన్ సింగ్ వరకు ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వాలు పాటు పడ్డాయని గుర్తు చేశారు. కాని బీజేపీ పాలనలో అడవి బిడ్డల భూములు, అటవీ వనరులు, జీవనాధారాన్ని కోల్పోయే పరిస్థితులు రావడం అత్యంత ఆందోళనకరమన్నారు. ప్రస్తుతం మైనింగ్ కార్యకాలపాల కోసం అడవులను పర్యవరణాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాలను వనరుల నిల్వలుగా మాత్రమే చూస్తూ, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆమె ఆరోపించారు.

### అస్థిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు

అదేవిధంగా, గిరిజనుల సంప్రదాయాలు, సంస్కృతి, వేష భాషలను, ప్రత్యేక గుర్తింపును దెబ్బతీసే విధంగా విధానాలు అమలు చేస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. గిరిజనులను వనవాసులుగా పేర్కొంటూ వారి అస్థిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె విమర్శించారు. గ్రామ సభల ఆమోదం లేకుండా ఎలాంటి భూసేకరణలు, ప్రాజెక్టులు చేపట్టకూడదని మంత్రి స్పష్టం చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తూ గిరిజనుల సంక్షేమాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీ బలరాం నాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, అన్ని రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొని ఆదివాసీ గిరిజన సమస్యలు, అభివృద్ధి అవకాశాలపై చర్చించారు. ఆయా వర్గాల హక్కుల పరిరక్షణ కోసం చేపట్టాల్సిన కార్యచరణ రూపొందించారు.

## దేశ నలుమూలలా శ్రీవారి వైభవం - ముంబయి ఆలయానికి రూ.5.12 కోట్లతో స్వర్ణ కవచాలు

ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి రంగంలోకి దిగింది. ముంబయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న శ్రీవారికి రూ.5.12 కోట్లతో స్వర్ణ కవచాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇతర రాష్ట్రాల్లో సైతం స్థలాల సేకరణ పూర్తి చేసి, ఆలయ నిర్మాణాలకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ బృహత్తర ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ముంబయి శ్రీవారికి స్వర్ణ కవచాలు : మహారాష్ట్రలోని నవీ ముంబయి (ఉల్వే ప్రాంతం)లో పది ఎకరాల్లో శ్రీవారి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. రేమండ్ గ్రూప్ చైర్మన్ గౌతమ్ సింఘానియా రూ.100 కోట్ల భారీ విరాళంతో దీన్ని కట్టిస్తున్నారు. ఇప్పటికే రూ.75 కోట్లతో 80 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది జూన్ నెలలో ఈ ఆలయాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ గుడిలోని మూలవిరాట్టుతో పాటు, ఉప ఆలయాల్లోని దేవతామూర్తులకు స్వర్ణ కవచాలు వేయాలని టీటీడీ నిర్ణయించింది. దీనికోసం మొత్తం రూ.5.12 కోట్లను మంజూరు చేసింది. మెటీరియల్ కోసం రూ.4.90 కోట్లు, తయారీ కూలీ కింద రూ.22 లక్షలు ఖర్చు చేయనున్నారు. టీటీడీ ఖజానా నుంచి 3 కిలోల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం, 125 కిలోల రాగి రేకులను ఈ కవచాల తయారీకి వినియోగించనున్నారు. దేశవ్యాప్తంగా కొత్త ఆలయాలు ఇవే : వివిధ రాష్ట్రాల్లో కొత్త ఆలయాల నిర్మాణానికి టీటీడీ ప్రతిపాదనలు ఆమోదించింది. టీటీడీ చైర్మన్ లేఖ రాయడంతో బీహార్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. పట్నా జిల్లా మోకమాలో 10.11 ఎకరాల భూమిని 99 ఏళ్ల పాటు, ఏడాదికి కేవలం రూపాయి నామమాత్రపు లీజుతో ఇచ్చేందుకు అంగీకరించింది. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 19.62 ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇచ్చింది. త్వరలో దీన్ని టీటీడీ తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకోనుంది. కర్ణాటక రాష్ట్రం బెలగావి జిల్లా కోలికొప్ప గ్రామంలో స్థానిక రెడ్డి సంఘం 7 ఎకరాల భూమిని ఇచ్చేందుకు ముందుకొచ్చింది. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఇక్కడ టీటీడీ ఆలయం నిర్మిస్తుంది. అసోం రాష్ట్రం కామరూప్ జిల్లాలోని అమెరిగోగ్ గ్రామంలో 10.32 ఎకరాల స్థలాన్ని అక్కడి ప్రభుత్వం రూ.28 లక్షలకు టీటీడీకి విక్రయించింది. ఇక్కడ దాతల విరాళాలతో గుడి కట్టనున్నారు. తిరుమలలో పర్యావరణం కోసం : మరోవైపు తిరుమలలో పర్యావరణాన్ని కాపాడేందుకు బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. కొండపై టెట్రా ప్యాక్‌లు, మెటల్ క్యాన్ల చెత్తను అరికట్టేందుకు హైదరాబాద్‌కు చెందిన 'రీసైకిల్' అనే సంస్థతో ఒప్పందం చేసుకుంది. 'డిపాజిట్ రిఫండ్ స్కీమ్' కింద తిరుమలలోని 28 ప్రాంతాల్లో మొత్తం 50 చోట్ల 'రివర్స్ వెండింగ్ మెషీన్ల'ను ఆ సంస్థ ఉచితంగా ఏర్పాటు చేయనుంది. భక్తులు వాడిన ఖాళీ క్యాన్లు, అట్టపెట్టెలను ఈ మెషీన్లలో వేస్తే, వారికి కొంత డబ్బు (రిఫండ్) తిరిగి వస్తుంది. దీనివల్ల తిరుమల వీధుల్లో చెత్తాచెదారం వేయడం తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. "అన్ని రాష్ట్రాల రాజధానుల్లో వెంకటేశ్వర స్వామి ఆలయాల నిర్మాణానికి ఉచితంగా స్థలం కేటాయించాలని కోరుతూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాశాం. మా విజ్ఞప్తికి ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు చాలా సానుకూలంగా స్పందించి భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఈ పురోగతితో ఇటీవల జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో వాటికి సంబంధించిన ప్రతిపాదనలను అధికారికంగా ఆమోదించాం

## మూసీ ప్రాజెక్టు రూ.1.5 లక్షల కోట్ల స్కామ్: కేటీఆర్



ప్రభుత్వ వైఖరిలో పారదర్శకత లేదని నిరసిస్తూ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో కేటీఆర్ మాట్లాడుతూ.. మూసీ నది పునరుజ్జీవనానికి తమ పార్టీ వ్యతిరేకం కాదని, కానీ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భారీ దోపిడీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధమైతే, దానిని ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. డీపీఆర్ లేకుండానే వేల ఇళ్ల కూల్చివేతకు, భూసేకరణకు ఎలా సిద్ధమవుతారని ప్రభుత్వాన్ని నిలదీశారు. కేటీఆర్ ఆరోపణలను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు. ప్రాజెక్టుపై ఎలాంటి దాపరికం లేదని, కేటీఆర్ ఆరోపణలు నిరాధారమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించిన డీపీఆర్ పూర్తయిందని, దాని అంచనా వ్యయం రూ.6,500 కోట్ల నుంచి రూ.7,000 కోట్ల వరకు ఉంటుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు వల్ల 1,435 నిర్మాణాలు ప్రభావితం అవుతాయని, తుది గణన జరుగుతోందని తెలిపారు. బఫర్ జోన్‌లో ఉన్న వారికి బదిలీ చేయగల అభివృద్ధి హక్కులు (టీడీఆర్) ఇస్తామని, భూసేకరణ, పునరావాసం 2013 చట్టం ప్రకారమే జరుగుతుందని హామీ ఇచ్చారు. అయితే, ప్రభుత్వ వాదనను కేటీఆర్ తోసిపుచ్చారు. ముఖ్యమంత్రి బహిరంగ సభల్లో రూ.1.5 లక్షల కోట్ల ప్రాజెక్టు అంటుంటే, సభలో మంత్రులు కేవలం రూ.7,000 కోట్లు అని చెప్పడంలోనే వైరుధ్యం కనిపిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ గెజిట్ ప్రకారం 10,000 ఇళ్లు కూల్చివేస్తారని, 3,260 ఎకరాల భూమిని సేకరించనున్నారని పేర్కొన్నారు. సింగపూర్, పాకిస్థాన్ వంటి దేశాల్లో నిషేధానికి గురైన 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి డీపీఆర్ బాధ్యతలు ఎలా అప్పగించారని ఆయన ప్రశ్నించారు. 18 నెలలు పట్టే డీపీఆర్‌ను రెండు నెలల్లోనే ఎలా పూర్తి చేశారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, స్పష్టమైన ప్రణాళిక కూడా లేదని, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి ఎలాంటి రుణం మంజూరు కాలేదని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ సమాధానంతో సంతృప్తి చెందని ఆయన, పారదర్శకత పాటించడం లేదని ఆరోపిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.

## పోలవరం నిర్వాసితులతో సీఎం చంద్రబాబు సమావేశం రూ.226 కోట్ల చెక్కు అందజేత

మొదటి పేజి తరువాయి



పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి అని నదులు అనుసంధానం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ప్రయోజనం కలుగుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేశామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతిందని నిపుణులతో అధ్యయనం చేయించి ఇప్పుడు మళ్లీ కొత్త డయాఫ్రాం వాల్ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి అవుతుందని గత 21 నెలల్లో ప్రాజెక్టు పనులు వేగవంతం చేశామన్నారు. 2025 జనవరిలో సంక్రాంతి పండుగలో మొదటి విడతగా నిర్వాసితులకు రూ.800 కోట్లు ఇచ్చామని, దీపావళికి రెండో విడతగా రూ.916 కోట్లను నిర్వాసితుల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. పుష్కరాలకు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం: ఈ 21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు మొత్తం రూ.1943.53 కోట్లను చెల్లించామని తెలిపారు. ప్రాజెక్టు తొలిదశలో 38,068 మంది నిర్వాసితులు ఉన్నారని మొత్తం 75 నిర్వాసిత కాలనీల్లో ఇప్పటికే 26 పూర్తి అయ్యాయన్నారు. ఇంకా 49 కాలనీలు నిర్మాణంలో ఉన్నాయని 2026 డిసెంబరు నాటికి వీటి నిర్మాణం పూర్తి అవుతుందని చెప్పారు. ఇంకా రూ.3,500 కోట్ల మేర ఖర్చు చేయాల్సి ఉందని ప్రతీ నిర్వాసితుడికి రూ.3.5 లక్షల మేర ఇంటి నిర్మాణం కోసం ఇస్తున్నట్లు వివరించారు. పారదర్శకంగా నిర్వాసితులకు చెల్లింపులు చేస్తున్నామన్న చంద్రబాబు నిర్వాసితులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. మూడోసారి గోదావరి పుష్కరాలు నిర్వహించే గౌరవం తనకు దక్కిందని ఈ పుష్కరాల నిర్వహణ కంటే ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ప్రారంభానికంటే ముందే నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని హామీ సీఎం ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తికి మరో రూ.5 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులంతా ప్రజల హృదయాల్లో నిలిచి పోతారని స్పష్టం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రూ.440 కోట్ల వ్యయం చేసి కట్టిన డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని వివరించారు. ఇప్పుడు మళ్లీ రూ.1000 కోట్లతో నిర్మాణం చేపట్టామని కాంట్రాక్టర్లను, ఇంజనీర్లను మార్చకుండా ఉంటే ప్రాజెక్టు పూర్తి అయిపోయేదన్నారు. దాదాపు 6-7 ఏళ్ల పాటు ప్రాజెక్టు ఆలస్యం అయిపోయిందని నిర్వాసితులు కూడా పూర్తిగా సెటిల్ అయ్యేవారని తెలిపారు. పోలవరం నిర్వాసితుల పట్ల తమ ప్రభుత్వానికి కమిట్‌మెంట్ ఉందని నిర్వాసిత యువతకు స్కిల్ డెవలప్ మెంట్ కూడా చేస్తామని స్పష్టం చేశారు. 2027లో పోలవరం పూర్తి: వైఎస్సార్సీపీ హయాంలో పోలవరం నిర్వాసితులు పండగలు అనేది మర్చిపోయారని మంత్రి నిమ్మల ధ్వజమెత్తారు. జగన్ 2 ఏళ్లలో ఎందుకు ఒక రూపాయి ఇవ్వలేదనేది సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పోలవరం గురించి నిర్వాసితుల గురించి మాట్లాడే అర్హత జగన్ కి లేదన్నారు. పోలవరం కోసం వచ్చిన నిధులను జగన్ దారి మళ్లించారని ఆరోపించారు. పోలవరం తమకు ఎంత ముఖ్యమో పోలవరం నిర్వాసితులు అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. 2027లో పోలవరం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. చంద్రబాబు పోలవరం అనుకున్న సమయానికి పూర్తి చేస్తారని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష తెలిపారు. నేరుగా నిర్వాసితులకు డబ్బులు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. గోదావరికి 2022లో వరదలు వస్తే తమకు జగన్ పిడికెడు బియ్యం ఇవ్వలేదని పోలవరం నిర్వాసితులు మండిపడ్డారు. నేడు చంద్రబాబు నిర్వాసితులకు కనకవర్షం కురిపిస్తున్నారని కొనియాడారు. చంద్రబాబు మమ్మల్ని ఏనాడూ నిర్వాసితులుగా చూడలేదని త్యాగమూర్తులుగానే పిలుస్తున్నారని చెప్పారు. చంద్రబాబు మా జీవితాల్లో వెలుగులు నింపారని ఆనందం వ్యక్తం చేశారు. నిర్వాసితులను గుర్తించి, గౌరవించింది కూటమి ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలోనే తమకు మౌలిక వసతులు కల్పించారని వెల్లడించారు. నాడు, నేడు తమకు అండగా నిలబడింది చంద్రబాబే అని చెప్పారు. ప్రతి కుటుంబానికి న్యాయం జరిగిందంటే అది చంద్రబాబు వల్లే అని తేల్చిచెప్పారు.

## రాజకీయాల్లో విరమణ అంటూ ఉండదు'- రాజ్యసభలో ప్రధానిమోదీ

మొదటి పేజి తరువాయి

నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

కొత్తగా ఎన్నికైన ఎంపీలు పాఠాలు నేర్చుకోవాలని ప్రధాని మోదీ సూచన

హెచ్‌డీ దేవెగౌడ, మల్లిఖార్జున ఖర్గే, శరద్ పవార్ వంటి సీనియర్ నాయకుల నుంచి కొత్తగా ఎన్నికైన ఎంపీలు పాఠాలు నేర్చుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. వీరంతా తమ జీవితంలో సగానికి పైగా పార్లమెంటరీ సేవలోనే గడిపారని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ కు వీడ్కోలు తెలిపారు. సౌమ్యుడు, మృదుభాషి అయినా కఠిన నిర్ణయాలు తీసుకునే వ్యక్తిగా ఆయనను ప్రశంసించారు. విరామ సమయాల్లో కూడా హరివంశ్ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ, జాతీయ ప్రాముఖ్యం గల అంశాలపై యువతతో మమేకమయ్యారని గుర్తు చేశారు. " హెచ్‌డీ దేవెగౌడ, మల్లిఖార్జున ఖర్గే, శరద్ పవార్ తమ జీవితంలో సగానికి పైగా పార్లమెంటరీ సేవలో గడిపిన సీనియర్ నాయకులు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వారి నుంచి పాఠాలు నేర్చుకోవాలి. సభలో హాస్యం, వ్యంగ్యానికి చాలా అవకాశం ఉందని మనం అప్పుడప్పుడు వింటూనే ఉంటాం. ఈ రోజుల్లో బహుశా అది క్రమంగా తగ్గుతోంది. కానీ మన అతవాలే మాత్రం ఆ విషయంలో ఎప్పటికీ ఎవర్ గ్రీన్ గా నిలుస్తారు. ఆయన వ్యంగ్యం, హాస్యాన్ని అందిస్తూనే ఉంటారని నాకు పూర్తి నమ్మకం ఉంది."

నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

'పాత, కొత్త పార్లమెంట్ భవనాల్లో పనిచేసిన అరుదైన ఘనత సొంతం'

పదవీ విరమణ చేస్తున్న కొందరు సభ్యులు పాత, కొత్త పార్లమెంట్ భవనాలు రెండింటిలోనూ పనిచేసిన అరుదైన ఘనతను సాధించారని మోదీ అన్నారు. జీవితాన్ని తీర్చిదిద్దుకోవడానికి ఆరేళ్ల రాజ్యసభ పదవీకాలం అమూల్యమైన అవకాశమని చెప్పారు.

ప్రేమ మాతో పెళ్లి మోదీతో : ఖర్గే

మరోవైపు రాజ్యసభలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ప్రసంగించిన కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలు, ప్రజా జీవితంలో ఉన్నవారు దేశానికి సేవ చేయాలనే తపనతో అలసిపోకుండా, పదవీ విరమణ చేయకుండా ఉంటారన్నారు. ఈ క్రమంలోనే మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడతో తనకు 54 ఏళ్లకు పైగా ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఉన్నవారు దేశానికి సేవ చేయాలనే తపనతో అలసిపోరు, విరమించుకోరు. నాకు దేవెగౌడ 54 ఏళ్ల ముందు నుంచి తెలుసు. నేను ఆయనతో చాలా కాలం పనిచేశాను. ఆ తర్వాత ఏమైందో నాకు తెలియదు. ఆయన మమ్మల్ని ప్రేమించి, మోదీని పెళ్లి చేసుకున్నారు." అంటూ చమత్కరించారు.

26 స్థానాలు ఏకగ్రీవం

కాగా, ఇటీవలె 10 రాష్ట్రాల్లోని 37 రాజ్యసభ స్థానాల భర్తీకి ఎన్నికల సంఘం నోటిఫికెషన్ ఇచ్చింది.

## దివ్యాంగులతో కలిసి భోజనం చేసిన మంత్రి నారా లోకేశ్

మొదటి పేజి తరువాయి

అమరావతి :దివ్యాంగుల గౌరవం పెంచేలా ప్రజా ప్రభుత్వం కృషిచేస్తుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించారు. మంగళగిరి బస్ స్టేషన్ నుంచి పెనుమాక వరకు దివ్యాంగులతో కలిసి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ ప్రయాణించారు. అనంతరం ఉండవల్లి నివాసంలో 'దివ్యాంగ శక్తి పథకం' లబ్ధిదారులతో జరిగిన ఆత్మీయ విందు సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులను ఆత్మీయంగా పలకరించిన మంత్రి లోకేశ్, తన పక్కన కూర్చొన్న శివనాగరాజు, సౌభాగ్య, ఖాశీంబి, అన్నపూర్ణమ్మలతో మమేకమై మాటామంతీ కలిపారు. వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దివ్యాంగుల గౌరవం పెంచాలని, వారిలో పట్టుదల ఎక్కువ అని అన్నారు. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని తెలిపారు. వారి నుంచి ఎంతో నేర్చుకోవచ్చని అన్నారు. వికలాంగుల ఆత్మగౌరవం ముఖ్యమని లోకేశ్ పేర్కొన్నారు. సమాజంలో కూడా మహిళలను కించపరిచే పదాలను అందరూ విడనాడాలని, ఇందుకోసం తాను పోరాడుతున్నానని అన్నారు.



### ప్రతి ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల

"కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే డీఎస్సీ ద్వారా 16వేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేశాం. ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల చేస్తున్నాం. ఇకపై ప్రతి ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు రావడం ద్వారా ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి కల్పన జరుగుతుంది. అందుకే అనేక కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నాం. మంగళగిరిలో ప్రభుత్వ భూమి లభ్యత చాలా తక్కువగా ఉంది. అందుకే కాజా వద్ద 75 ఎకరాల భూమి కొనుగోలు చేస్తున్నాం. మంగళగిరికి 4,5 ఐటీ కంపెనీలను తీసుకువస్తాం. సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తుంది" అని లోకేశ్ తెలిపారు.

### అమెరికా వెళ్లడం నా జీవితంలో అత్యుత్తమ నిర్ణయం

స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఎంతో లబ్ధి చేకూరుతోందని లోకేశ్ అన్నారు. స్త్రీలు ఎవరిపై ఆధారపడకూడదని అభిప్రాయపడ్డారు. ఇంటర్ తర్వాత అమెరికా వెళ్లడం తన జీవితంలో అత్యుత్తమ నిర్ణయమని తెలిపారు. అందుకే నా సొంత కాళ్లపై నిలబడగలిగానని, దాదాపు 8 ఏళ్లు నేను అమెరికాలో ఉన్నానని వెల్లడించారు. చదువుతో పాటు ఉద్యోగం చేశానని, దీంతో తనకు ఎంతో అవగాహన వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల యోగక్షేమాలను, ప్రభుత్వం నుంచి అందుతున్న లబ్ధిని ఈ సందర్భంగా మంత్రి అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ అందుకున్న తర్వాత ఐవీఆర్ఎస్ కాల్స్, సీఎం సందేశం వస్తున్నాయా అని వాకబు చేశారు. తమ పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రిని విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వంలో అన్నివిధాల అండగా ఉంటామని మంత్రి లోకేశ్ వారికి హామీ ఇచ్చారు. వారితో కలిసి ఫోటోలు దిగారు.

## ఈడీ సోదాలను సీఎం అడ్డుకోవడం సరికాదు- సీఎం మమతపై సుప్రీంకోర్టు అసహనం

మొదటి పేజి తరువాయి

జనవరి 8న తాము చేసిన సోదాలను సీఎం మమతా బెనర్జీ అడ్డుకున్నారంటూ సుప్రీంకోర్టును ఈడీ ఆశ్రయించింది. తమ సోదాలు జరుగుతుండగానే ప్రతీక్ జైన్ నివాసంలోకి సీఎం ప్రవేశించి, ల్యాప్‌టాప్, ఫోన్, పలు డాక్యుమెంట్లను తీసుకెళ్లారని ఆరోపించింది. సీఎం హోదాలో ఉన్న మమతా బెనర్జీ ఇలా చేయడం తీవ్రమైన అధికార దుర్వినియోగమేనని సుప్రీంకోర్టుకు ఈడీ తెలిపింది. ఈవిధంగా వ్యవహరించినందుకు ముఖ్యమంత్రి మమతపై, ఆమెతో కలిసి ఈడీ దర్యాప్తుకు అంతరాయం కలిగించిన రాష్ట్ర అధికారులపై పోలీసు కేసులు నమోదు చేయాలని దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరింది.

### ఈడీకి పిటిషన్ వేసే అవకాశమివ్వడం సమాఖ్య వ్యవస్థకు ముప్పు: బంగాల్ ప్రభుత్వం

ఈ వ్యవహారంలో బంగాల్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ అడ్వకేట్ శ్యామ్ దివాన్ వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పిటిషన్‌ను దాఖలు చేసే అవకాశాన్ని ఒక కేంద్ర ప్రభుత్వ విభాగానికి కల్పించడం అనేది దేశ సమాఖ్య వ్యవస్థకు ముప్పు లాంటిదని శ్యామ్ దివాన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలపై పిటిషన్లు వేసే హక్కు సీబీఐ, ఈడీ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ వంటి దర్యాప్తు సంస్థలకు లేదన్నారు. రాష్ట్రస్థాయి దర్యాప్తు సంస్థలైన సీఐడీ, విజిలెన్స్ కమిషన్, యాంటీ కరప్షన్ బ్యూరోలకు కూడా ఇలాంటి హక్కు లేదని ఆయన సుప్రీంకోర్టులో వాదన వినిపించారు.

### ముఖ్యమంత్రే సోదాలను అడ్డుకుంటే ఏం చేయాలి

ఈక్రమంలో న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా జోక్యం చేసుకొని కీలక ప్రశ్నలు అడిగారు. నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రే కేంద్ర దర్యాప్తు సంస్థ సోదాలను అడ్డుకునే అసాధారణ పరిస్థితులు తలెత్తితే ఏం చేయాలని ఆయన ప్రశ్నించారు. ఈ కేసులో తమ సోదాలను స్వయంగా సీఎం మమతా బెనర్జీయే అడ్డుకున్నారని కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ఆరోపిస్తోందని న్యాయమూర్తి గుర్తుచేశారు. "ఒకవేళ ఆర్టికల్ 226ను అమలు చేయలేకపోతే, ఆర్టికల్ 32ను కూడా అమలు చేయలేరు. అలాంటప్పుడు ఎవరు నిర్ణయిస్తారు భవిష్యత్తులో వేరొక ముఖ్యమంత్రి, వేరొక దర్యాప్తు సంస్థ సోదాలకు అడ్డుతగలొచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగపరమైన పరిష్కారమేంటి అనే విషయంలో శూన్యత ఉండకూడదు" అని న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు.

### నేరుగా కేంద్ర ప్రభుత్వమే చర్యలను చేపట్టాలి: బంగాల్ ప్రభుత్వ అడ్వకేట్

తదుపరిగా బంగాల్ ప్రభుత్వం తరఫు న్యాయవాది శ్యామ్ దివాన్ వాదనను కొనసాగిస్తూ, ఇలాంటి అంశాలకు రాజ్యాంగం ఒక పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర దర్యాప్తు సంస్థ సొంతంగా కాకుండా, నేరుగా కేంద్ర ప్రభుత్వమే తగిన చర్యలను చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యపై నెలకొన్న శూన్యత కారణంగా, విస్తృత ధర్మాసనం ద్వారా అధికారిక నిర్ణయం అవసరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈవిధంగా దర్యాప్తు సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వాలపై పిటిషన్లు వేసే అవకాశాన్ని కల్పిస్తే, ఇందులో కోర్టులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని న్యాయవాది శ్యామ్ దివాన్ చెప్పారు. దీనివల్ల దేశ సమాఖ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరిష్కారానికి నోచుకోని న్యాయవివాదాలకు దారితీస్తుందన్నారు. ఇక ఈ కేసుపై తదుపరి వాదనలను మార్చి 24న వింటామని సుప్రీంకోర్టు బెంచ్ తెలిపింది.

## 40 సెకన్లలో 64 పుషప్స్- రెండు బొటనవేళ్లపై ఈ ఫీట్ సాధించిన 'విక్కీ'

మొదటి పేజి తరువాయి

లోధికి చెందిన హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ విక్కీ డియోల్. కేవలం 40 సెకన్లలో చేతి బొటనవేళ్లపై 64 పుషప్స్ తీశారు. ఈ క్రమంలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు.

తన పాత రికార్డును బద్దలు కొట్టిన విక్కీ

విక్కీ డియోల్ 2021లో 40 సెకన్లలో 40 పుషప్స్ తీశారు. తాజాగా ఇప్పుడు తన రికార్డు తానే బద్దలు కొట్టారు. 40 సెకన్లలో చేతి బొటనవేలుపై 64 పుషప్స్ తీశారు. 3 అడుగుల ఎత్తులో ఉంచిన మూడు ఇనుప కడ్డీలపై బ్యాలెన్స్ చేస్తూ ఈ ఫీట్‌ను సాధించారు. అంతేకాకుండా పుషప్స్ తీసే సమయంలో ఒక కాలిని గాలిలో ఉంచారు. చండీగఢ్‌లోని పంజాబ్ విశ్వవిద్యాలయంలో జరిగిన 'ఫిట్ ఇండియా కార్నివాల్'లో ఈ ప్రదర్శన చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. తన కుమారుడు సాధించిన విజయం పట్ల విక్కీ డియోల్ తల్లి సంతోషం వ్యక్తం చేశారు. కుటుంబంలో అందరూ ఆరోగ్యం ఉంటే, ఆ ఫ్యామిలీ చాలా హ్యాపీగా ఉంటుందన్నారు.

తల్లి ప్రోత్సాహంతో ఉన్నత శిఖరాలకు

తాను ఫిట్‌నెస్ రంగంలోకి అడుగుపెట్టడానికి స్ఫూర్తి తన తల్లేనని విక్కీ డియోల్ తెలిపారు. "నా తల్లి ఒక ప్రైమరీ స్కూల్‌లో టీచర్‌గా పనిచేసేవారు. నన్ను చిన్నప్పటి నుంచి క్రీడలు, ఫిట్‌నెస్ పట్ల ప్రోత్సహించింది. ఆ స్ఫూర్తే నన్ను నిరంతరం ముందుకు నడిపించింది. ఇప్పుడు ఒక్క రోజు కూడా విరామం లేకుండా నేను సాధనను కొనసాగిస్తున్నాను. నేను ఈ స్థాయికి అంత ఈజీగా రాలేదు. కేవలం 40 సెకన్లలో 64 పుషప్స్ చేయడం వెనుక కొన్ని సంవత్సరాల కఠోన శ్రమ దాడి ఉంది. నేను ప్రతిరోజూ 7-8 గంటలపాటు వ్యాయామం చేస్తాను." అని విక్కీ డియోల్ వెల్లడించారు.

'ఈ స్థాయికి చేరుకోవడానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాను'

రెండు బొటన వేళ్లపై పుషప్స్ చేయడం చాలా కష్టమని విక్కీ డియోల్ తెలిపారు. ఈ సాధన చేయడానికి తనకు సుమారు 10- 15 ఏళ్ల సమయం పట్టిందని గుర్తు చేశారు. మొదట్లో తాను అరచేతులపై పుషప్స్ చేసేవాడినని వెల్లడించారు. ఆ తర్వాత వేళ్లపై, ఆపై రెండు బొటన వేళ్లపై పుషప్స్ తీయడం సాధన చేసి విజయం సాధించానని చెప్పారు. ఈ గమ్యాన్ని చేరుకోవడానికి తాను ఎన్నో కష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 3 గంటలకు నిద్రలేచి, సుమారు ఆరు-ఏడు గంటల పాటు సాధన చేస్తానని చెప్పారు. డైట్‌లో భాగంగా ఇంట్లోని పాలు, లస్సీ, పంజాబ్ గ్రామీణ ఆహారాన్ని మాత్రమే తింటానని వివరించారు. '3 అడుగుల ఎత్తులో ఉన్న ఇనుప రాడ్లపై బ్యాలెన్స్ పాటిస్తూ ఈ ప్రదర్శన ఇవ్వడం చాలా సవాల్‌తో కూడుకున్న విషయం. ఇంట్లో సాధన చేసేటప్పుడు ఒత్తిడి తక్కువగా ఉంటుంది. కానీ వందలాది మంది ప్రేక్షకుల సమక్షంలో ప్రదర్శన ఇవ్వాల్సి వచ్చినప్పుడు కాస్త ఒత్తిడి ఉంటుంది. గందరగోళానికి గురవుతాం. ఈసారి నేను నా పాత రికార్డు అయిన 40 పుషప్స్‌ను అధిగమించి కొత్త రికార్డు సృష్టించడానికి సిద్ధమైనప్పుడు నా మనసులో అనేక ఆలోచనలు వచ్చాయి. ఎందుకంటే ఈ స్థాయికి చేరుకోవడానికి నాకు ఎన్నో ఏళ్లు పట్టింది. పైగా నా పాత రికార్డును ఇప్పటి వరకు ఎవరూ అధిగమించలేదు. నేను మూడో తరగతి నుంచే క్రీడలలో పాల్గొంటున్నాను. ఆరోగ్యంగా ఉండటం, ఇతరులను కూడా అలాగే ఉండేలా ప్రేరేపించడం నా దైనందిన ప్రయత్నం. నాలాంటి ఇతర ఫిట్‌నెస్ ప్రియులతో కలిసి పంజాబ్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఫిట్‌నెస్ పట్ల అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నాను" ఈ ప్రయాణంలో తనకు కుటుంబం, స్నేహితులు అండగా నిలిచారని విక్కీ డియోల్ తెలిపారు. వారి ప్రోత్సాహం, ప్రేరణ వల్లే తాను ప్రస్తుతం ఈ స్థాయికి చేరుకోగలిగానని చెప్పారు. నేటి యువత ఫిట్‌నెస్ పట్ల తక్కువ శ్రద్ధ చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కానీ ఆరోగ్యంపై యువత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యకరమైన శరీరం అనేది ఆరోగ్యకరమైన జీవితానికి పునాదని

# సంపాదకీయం

## జాషువా అడుగుజాడల్లో మధురకవి మల్లవరపు

కవి హృదయానికి అనివార్యంగా అమ్మతనం ఉండాలి. అమ్మ బలవర్ధకమూ జీర్ణయోగ్యమైన ఆహారాన్ని మాత్రమే బిడ్డకు అందించినట్లుగా కవి కూడా సమాజానికి అవసరమైన తాత్త్వికస్ఫూర్తిని పాఠకవిధేయంగా కవిత్వంలో ప్రబోధించాలి. వేమన నుండి గద్దర్ వరకూ అనేకమంది మహాకవులు ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించి సాహిత్యానికి సమున్నత విలువనూ విస్తృతినీ సమకూర్చారు. ఇదే ఎరుకతో జాషువా లాంటి కవులు పద్యకవిత్వాన్ని మరోమలుపు తిప్పారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో జాషువా మార్గంలో మడమ తిప్పకుండా పయనించిన సాహితీమూర్తుల్లో విశిష్టకవి మల్లవరపు జాన్. జాన్ పేరు ఈ తరం వచన కవులకు పరిచయం లేకపోవచ్చు. దివాకర్ల వెంకటావధాని, విశ్వనాథ సత్యనారాయణ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, కరుణశ్రీ, సినారె, బోయి భీమన్న, కొలకలూరి ఇనాక్, నాగభైరవ కోటేశ్వరరావు, బేతవోలు రామబ్రహ్మం వంటి సుప్రసిద్ధ కవి పండితులకు మాత్రం నులివెచ్చని రాగిముద్ద లాంటి ఆయన పద్యకవిత్వం పరమ ఇష్టం. "తేనెలూరు తెల్గు తీరు గనుంగొన కోర్కె వొడమువారు" మల్లవరపు జాన్ కావ్యాలను పరిశీలించమని తుమ్మల సీతారామమూర్తి రసహృదయులకు పిలుపునిచ్చాడు. "జాన్ పద్యం మాధుర్యగుణ భూయిష్ఠమైన"దని 'అతుకుల బ్రతుకులు' కావ్య పీఠికలో దాశరథి కితాబిచ్చాడు. 'మధురకవి'గా ప్రఖ్యాతిగాంచిన మల్లవరపు జాన్ 1927 జనవరి 22న ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఒంగోలు తాలూకా చీమకుర్తిలో దావీదు, రత్నమ్మ దంపతులకు జన్మించాడు. "చెప్పులు కుట్టి జీవనము సేయు కుటుంబము నందు బుట్టి, చిన్నప్పటి నుండి శారద పదార్చన జేసితి" అని ఈ కవి చెప్పుకున్నట్లుగానే అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని, కఠోర కృషితో జ్ఞానార్జన చేసి, ఉద్దండ పండితులను ఢీకొని, ప్రభావశీలమైన పద్యకవిగా జాన్ రాణించాడు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన జాన్ తర్వాత ప్రథమశ్రేణి తెలుగు పండితుడై వందలాదిమంది శిష్యులకు భాషా సాహిత్యాను బోధించి, ఉత్తమ గురువుగా ప్రకాశంజిల్లాలో పేరు గాంచాడు. ప్రారంభ దశలో ముత్యాల సరాల శైలిలో గేయ కవిత్వం రాశాడు. ఒంగోలులోని శఠగోపనాచార్యుని సహకారంతో సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలను, పంచకావ్యాలను అధ్యయనం చేసి, పద్యకవిత్వం వైపు కలం సారించాడు. పౌరాణిక పద్య నాటకాల ప్రభావంతో క్రైస్తవ ఇతివృత్తం నేపథ్యంలో జాన్ రాసిన 'సాంసన్ డెలీల' (1967) పద్యనాటకం ఆయనకు ఎంతగానో పేరు తెచ్చింది. 'విశ్వప్రకాశం' (1973), 'అతుకుల బ్రతుకులు' (1981), 'కాంతిరేఖలు' (1987), 'సూక్తిశతకం', 'సరసవినోదిని' (1991), 'చిరస్మరణీయులు' (1993), 'భావ విపంచి' (1996), 'పుణ్య పురుషుడు' (2005) వంటి ఖండకావ్యాలతో, కృతులతో మల్లవరపు జాన్ ఆధునిక పద్య కవిత్వంలో సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్నాడు. మైసూరు తదితర విశ్వవిద్యాలయాల్లో జాన్ రచనలు పాఠ్య గ్రంథాలుగా ఉండటం అరుదైన విషయం. అవిద్య, పేదరికం, మద్యపానం, అధిక జనాభా, కుటుంబ నియంత్రణ, అవినీతి, లంచగొండితనం, వరకట్నం, మహిళాభ్యుదయం, దళితుల సంక్షేమం, కులనిర్మూలన, దేశభక్తి లాంటి అంశాలపట్ల ప్రజల్లో సదావగాహన కల్పించడానికి కవిత్వం ద్వారా జాన్ కృషి చేశాడు. అభ్యుదయ కవితా ప్రభంజనం తీరం దాటుతున్న సాహిత్య సందర్భంలో కవిగా రంగప్రవేశం చేసిన మల్లవరపు జాన్, అస్తిత్వ ఉద్యమాలు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్న సందర్భంలో కన్ను మూశాడు (2006 ఆగస్ట్ 12). ఈ నాలుగు దశాబ్దాల్లో సాగిన సామాజిక ఉద్యమాల మౌలిక ఆశయాలను ప్రతిభావంతంగా జాన్ అక్షరబద్ధం చేశాడు. "పనులు జేయకుండ పంచభక్ష్యములను/ తేరగా భుజించి తిరుగువారు/ కష్టజీవి సొమ్ము కాజేయు గజదొంగల"ని అభ్యుదయ కవిలా గర్జించాడు. "సామ్రాజ్యవాదుల సాహచర్యంబున, స్వార్థ జీవనుల హస్తములజిక్కి" మాతృదేశం విలవిలలాడుతుందని జాతీయోద్యమ కవిలా ఆవేదన చెందాడు. సంప్రదాయ ఛందోబంధోబస్తుల రహదారుల్లో ప్రయాణం చేస్తూనే, ఆధునిక దృష్టితో నిరాడంబరమైన శిల్పచాతుర్యంతో ప్రజాకవిత్వాన్ని సృజించి, జాన్ సమకాలీన పద్యకవులకు ఆదర్శంగా నిలిచాడు అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంతో వెలువడే వర్తమాన సాహిత్యానికి జాన్ కవిత్వం సరికొత్త ఉత్తేజాన్ని అందిస్తుంది. అసమ సమాజ దుర్నీతిని, మతరాజకీయాల పెనుప్రమాదాలను మల్లవరపు జాన్ తీవ్రంగా వ్యతిరేకించాడు. రామ జన్మభూమి, బాబ్రీ మసీదు గొడవల నెత్తురు మడుగుల్లో బ్రతుకు దుంపతెగుతుందని" బాధపడుతూనే "ఓమన్న, ఆమెన్ నన్న, రహీమన్న పదాలు సన్నిహిత తుల్యార్థ/ స్తోమము" లని ('భావ విపంచి') మతసామరస్యాన్ని ప్రబోధించాడు. "హరిపదాల బుట్టి అరుగుదెంచిన గంగ/ పాప జనుల శుద్ధి పరచుచుండ/ అజుని పాదజనితు లస్పృశ్యులెట్లైరి?" అని పౌరాణిక దృష్టితోనే కులవ్యవస్థ కుటిలత్వాన్ని ప్రశ్నించాడు. విష్ణుపాదాల నుండి పుట్టిన గంగ పవిత్రమైనదైతే, బ్రహ్మ పాదాల నుండి జనించినట్లు చెప్పబడుతున్న అతిశూద్రులైన దళితులు అంటరానివారు ఎందుకయ్యారని తర్కబద్ధంగా జాన్ వాదించాడు. "పురుషులతో సమానంగా సర్వకార్యములు నెరపిడి శక్తియుక్తులు నేర్చిన" ఆధునిక స్త్రీలను అణచివేయడం సభ్యసమాజానికి సిగ్గుచేటు అన్నాడు. పద్యకవుల్లో మృగ్యమైన అంతర్జాతీయ రాజకీయస్పృహ జాన్ కవిత్వంలో దర్శనమిస్తుంది. కువైట్‌ను కబళించిన అమెరికా ఆధిపత్యం, గల్ఫ్ యుద్ధాల దుష్ప్రభావం లాంటి అంశాలను తన పద్యాల్లో అక్షరబద్ధం చేశాడు. అమెరికా యుద్ధోన్మాదాన్ని నిరసిస్తూ "ఒక సద్దాము పట్టగా సకలోర్వీ నాశనముసల్పుట తగునా? ఐక్య రాజ్యపున్ సమితి ప్రపంచ శాంతికై సత్వరయత్నము చేయదేలకో?" అని ఆక్షేపించాడు.

# మంచి నీళ్లే తాగుతున్నామా?



ఇటీవల కొత్త ఏడాది సంబరాల నడుమ చోటుచేసుకున్న జల కాలుష్య దుర్ఘటనలు కలకలం రేపాయి. దేశంలో అత్యంత శుభ్రమైన నగరంగా రికార్డులకెక్కిన ఇందౌర్‌లో తాగునీరు కలుషితమై పలువురు మరణించారు. గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో కలుషిత తాగునీటితో దాదాపు వంద మంది టైఫాయిడ్ బారినపడ్డారు. భారతీయ సిలికాన్ వ్యాలీగా ప్రసిద్ధిపొందిన బెంగళూరులో తాగునీరు మురుగు వాసన వస్తోందని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మరి, ఇలాంటి సమస్యలకు పరిష్కారమేంటి? జల కాలుష్యం కారణంగా ప్రాణనష్టం సంభవించడం తరహా దుర్ఘటనల్లో బాధితులకు వెంటనే నష్టపరిహారం ప్రకటించడం ద్వారా ఆదుకునే ప్రయత్నాలు మంచివే. అయితే, సమస్య అంతటితో తీరిపోదు. శాశ్వత పరిష్కారాల్ని గుర్తించాలి. రాజకీయాలకు తావులేకుండా, స్థిమితంగా ఆలోచించి పరిష్కారాలు వెదకాలి. వివిధ జాతీయ తాగునీటి కార్యక్రమాల్లో లోపాలేమైనా ఉన్నాయా అనేది తరచి చూసుకోవాలి. వాటి పరిష్కారానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. కలుషిత నీటితో మరెవరి ప్రాణాలూ పోకుండా జాగ్రత్త పడాలి. ముఖ్యంగా కేంద్ర బడ్జెట్‌లో రూ.67వేల కోట్లు కేటాయించిన జల్ జీవన్ మిషన్ సఫలం కావాలంటే ఇలాంటి లోపాలను పరిహరించాలి. వాటికి బాధ్యులైన అధికారులు, సాంకేతిక సిబ్బందిని కోర్టులో విచారించి శిక్షలు వేయించాలి. మరోవైపు, వేసవిలో తాగునీటికి డిమాండ్ పెరిగి, సరఫరా తగ్గే అవకాశాలున్నాయి. అందుకని ఇప్పటి నుంచే పట్టణ తాగునీటి సరఫరా వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. ఈ మేరకు దీన్ని కేంద్ర ప్రభుత్వం ముందుగానే గుర్తించి వివిధ జిల్లాల్లో కాలువలు, చెరువుల పునరుద్ధరణ, సంరక్షణ పనులను ఉపాధి పథకం కింద చేపట్టాలని ఆదేశించింది.

### వాతావరణ మార్పుల ప్రభావం

దేశ జనాభాలో సగంమందికి 2030నాటికి శుభ్రమైన తాగునీటికి కొరత ఏర్పడుతుందని నీతి ఆయోగ్ ఇప్పటికే హెచ్చరించింది. వాతావరణ మార్పులు, కాలుష్యం నీటి సరఫరాను కుదించివేస్తూ కలుషిత జలాలకు కారణమవుతున్నాయి. 2025-26లో దేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవగా, హిమాలయ ప్రాంతంలో హిమానీ నదాలు కరిగిపోతూ, మంచు కురవడం తగ్గిపోయింది. హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు హిమపాతం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితులకు వాతావరణ మార్పులే కారణంగా నిలుస్తున్నాయి. నదుల్లోకి పట్టణాల మురుగు నీరు, పారిశ్రామిక వ్యర్థాలు చేరిపోతున్నాయి. నదుల్లో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిగిపోతున్నాయి. నదీ తీరాలు ఆక్రమణకు గురవుతున్నాయి. పారిశ్రామిక స్థాయిలో వ్యవసాయం, వరి, చెరకు సాగుకు భారీ సబ్సిడీల వల్ల వర్షాభావ ప్రాంతాల్లో సైతం పంటల కోసం భూగర్భ జలాలను తోడివేయడం మితిమీరింది. ఫలితంగా భూగర్భ జలమట్టాలు లోలోతులకు దిగిపోతున్నాయి. దీనివల్ల భూమి కుంగిపోతోంది. ఇలా దుర్వినియోగం, కాలుష్యం, వాతావరణ మార్పులు వంటివన్నీ కలగలిసి జల వనరులు హరించుకుపోవడానికి కారణమవుతున్నాయి. మరోవైపు సాగు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకూ నీటి కొరత ఏర్పడుతోంది. ఇంటింటికీ కొళాయిల ద్వారా నీటి సరఫరా, నదుల అనుసంధానం వంటివి తాత్కాలిక పరిష్కారాలే తప్ప శుభ్రమైన తాగునీటి సరఫరాకు భరోసా ఇచ్చే మార్గాలు కావు. ప్రభుత్వం సరఫరా చేసే పైపులైన్ల ద్వారా కూడా కలుషిత జలం ఇళ్లకు చేరి ప్రజలను అనారోగ్యంపాలు చేస్తోందని తాజా ప్రమాదాలు చాటి చెబుతున్నాయి. ఇక సరికొత్త పంథా చేపట్టక తప్పదు. అదే నీటి సరఫరాకూ గాంధేయ గ్రామ స్వరాజ్య సిద్ధాంతాన్ని వర్తింపజేయడం. ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న కేంద్రీకరణ, ప్రైవేటీకరణ మార్గాల బదులు వికేంద్రిత సాముదాయిక జల నిర్వహణ పద్ధతులను చేపట్టాలి. ఇందుకు ఆధునిక సాంకేతికతలను ఉపయోగించాలి. ప్రజల చేతికే జలస్వరాజ్యం బాధ్యతలను అప్పగించి శుభ్రమైన తాగునీటికి భరోసా సాధించాలి. స్థానిక జలవనరుల రక్షణ, వాననీటి సంరక్షణకు ఉద్దేశించిన ప్రభుత్వ పథకాల అమలు బాధ్యతను గ్రామ పంచాయతీలకు ఇవ్వాలి. ఆ పథకాలకు కేటాయించిన నిధులను వెచ్చించి, ఆశించిన ఫలితాలను సాధించే బాధ్యతనూ అప్పగించాలి. కొన్ని గ్రామాలు కలిసి సాముదాయిక జలాశయాలను ఏర్పాటు చేసుకుని, వాన నీటిని సంరక్షించుకునేలా ప్రేరణ అందించాలి. అంటే జల నిర్వహణ బాధ్యతను స్థానిక స్వపరిపాలన సంస్థలకు అప్పగించాలి. భూగర్భ జలాల పునరుద్ధరణను గ్రామాల చేతికే ఇవ్వాలి. మట్టికట్టలు పోయడం, వాన నీటిని నేలలోకి ఇంకించి భూగర్భ జలాలను పునరుద్ధరించాలి. జిల్లా స్థాయిలో పట్టణాలు, బ్లాకులను అనుసంధానించి ఉపరితల, భూగర్భ జల సంరక్షణ బాధ్యతను అప్పగించాలి. ఇలా జిల్లాల్లో తాగునీటి లభ్యత ఉండేలా చూడాలి. గ్రామాల స్థాయిలోనే నీటి నాణ్యతను సంరక్షించాలి. కలుషిత జలాల వల్ల వ్యాధులు విరుచుకుపడినా, నీటి కాలుష్యం ఏర్పడినా స్థానికులను మొబైల్ ఫోన్ల ద్వారా వెంటనే హెచ్చరించి, నివారణ మార్గాలను తెలిపే ఏర్పాట్లు చేయాలి.

### నీటి నిర్వహణే కీలకం

మన సంస్కృతి ప్రకృతిని ఆరాధిస్తుంది. ప్రజాస్వామ్య లక్షణం మన నాగరికతలోనే ఉంది. ఈ లక్షణాలను ఆధారంగా చేసుకుని జల స్వరాజ్యం సాధించాలి. పూడుకుపోయిన కుంటలు, చెరువులను యుద్ధప్రాతిపదికపై పునరుద్ధరించాలి. ఆయకట్టు ప్రాంతాల్లో అడవులు పెంచి సహజసిద్ధమైన రీతిలో నీటి వనరులను పునరుద్ధరించాలి. పొలాలను అమితంగా నీటిని తాగే పరిస్థితి నుంచి నీటిని ఇముడ్చుకునే స్థాయికి చేర్చేలా చర్యలు తీసుకోవాలి. సేంద్రియ వ్యవసాయాన్ని విస్తరించి పొలాలను కూడా నీటి సంరక్షణలో అంతర్భాగంగా మార్చాలి. నగరాలన్నీ తప్పనిసరిగా వాన నీటి సంరక్షణ విధానాలు రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలి. కాంక్రీటు అరణ్యాల్లా మారిన మన నగరాల్లో కురిసిన వాన నేరుగా డ్రైనేజీల్లోకి పారుతోంది. వాన నీటిని భూగర్భంలోకి ఇంకించి, నీటి సంరక్షణ సాధించాలి. జల సంరక్షణ విషయంలో కలిసికట్టుగా కృషి చేయాలి. మన సంస్కృతీ ప్రబోధాన్ని పాటించి జల వనరులను కాపాడుకోవాలి. భారీ నీటిపారుదల ప్రాజెక్టులకన్నా, గ్రామస్థాయిలో నీటి కుంటలు, చెరువుల సంరక్షణ, సాముదాయిక నీటి నిర్వహణే ప్రస్తుతావసరం.

# సీపీఐ 100 ఏళ్ల ప్రస్థానం..



భారతదేశ రాజకీయ చరిత్రలో కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల గొంతుగా నిలిచిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ). 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన ఈ పార్టీ 2025 డిసెంబర్26తో 100 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటుంది. ఇది కేవలం ఒక రాజకీయ పార్టీ చరిత్ర మాత్రమే కాదు, భారతదేశ ప్రజా ఉద్యమాల చరిత్ర. సీపీఐ 100 ఏళ్లు అంటే అధికారం కోసం చేసిన ప్రయాణం కాదు, ప్రజల కోసం చేసిన త్యాగాల చరిత్ర. రైతు, కార్మికుడు, పేదవాడు సంతోషంగా జీవించే సమాజం కోసం సీపీఐ నడిచిన ఈ శతాబ్ది ప్రస్థానం భారత ప్రజాస్వామ్యానికి ఒక అమూల్యమైన అధ్యాయం.

### రష్యా విప్లవ ప్రభావంతో...

బ్రిటిష్ వలస పాలన కాలంలో దేశమంతా పేదరికం, దోపిడీ, అన్యాయం రాజ్యమేలుతున్న సమయంలో, రష్యా విప్లవ ప్రభావంతో ప్రేరణ పొందిన భారత విప్లవకారులు 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐని స్థాపించారు. వలస పాలనకు వ్యతిరేకంగా, కార్మికరైతు హక్కుల కోసం ఒక శక్తివంతమైన వేదికగా సీపీఐ అవతరించింది. సీపీఐ శ్రేణులు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేశారు. కార్మిక సమ్మెలు, రైతాంగ ఉద్యమాలు, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడం... ఈ పోరాటాల్లో అనేక మంది కమ్యూనిస్టులు జైళ్ల పాలయ్యారు, ప్రాణాలు కూడా కోల్పోయారు. స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో సీపీఐ పాత్రను విస్మరించలేం.

### ప్రజా ఉద్యమాల శతాబ్ది

స్వాతంత్ర్యానంతరం ప్రజల పక్షాన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా సీపీఐ తన పోరాటాన్ని ఆపలేదు. దేశంలో వివిధ వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక ప్రజా సంఘాలు ఏర్పాటు చేసి మహిళలు, రైతులు, వ్యవసాయ కూలీలు, దళితులు, గిరిజనులు, యువజనులు, విద్యార్థులకు అండగా ఉండి పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ. భూసంస్కరణలు, కార్మిక హక్కులు, కనీస వేతనాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ, విద్య, ఆరోగ్య రంగాలపై ప్రభుత్వ బాధ్యత వంటి అంశాలపై నిరంతరం ఉద్యమాలు చేసింది. కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర వంటి రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడి ప్రజాపాలనకు దిశానిర్దేశం చేశాయి.

### తెలంగాణ ఏర్పాటులో కీలకపాత్ర

ఫాసిస్టు ధోరణులు, నియంతృత్వ పాలనలకు వ్యతిరేకంగా సీపీఐ ఎప్పుడూ నిలబడింది. మాట స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ హక్కు, లౌకికత్వం, సమాఖ్య వ్యవస్థను కాపాడేందుకు సీపీఐ కీలక పాత్ర పోషించింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ముందున్న పార్టీ సీపీఐ. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని జాతీయ స్థాయిలో ఉద్యమం చేసిన పార్టీ సీపీఐ. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైల్ రోకోలు, పాదయాత్రలు నిర్వహించి ప్రజల్లో ఉద్యమ చైతన్యం తీసుకువచ్చి అరెస్టులకు, కేసులకు భయపడకుండా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించింది సీపీఐ. 100 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో ప్రజా విజయాలు సాధించినప్పటికీ, మారుతున్న కార్పొరేట్ రాజకీయ పరిస్థితులను అధిగమిస్తూ ప్రజల మధ్య ఉండి పోరాటాలు నిర్వహిస్తున్నది సీపీఐ. ప్రైవేటీకరణ, కార్పొరేట్ శక్తుల ప్రభావం, మత రాజకీయాల పెరుగుదల వంటి అంశాలు తిప్పికొడుతూ సమ సమాజ స్థాపన కోసం కృషి చేస్తూ పేద ప్రజలకు అండగా ఉంటూన్నది. భవిష్యత్ భారతదేశానికి సీపీఐనే ప్రత్యామ్నాయం.

# పెన్షనర్లకు ఏదీ దిక్కు?

ఆశలు ఆవిరయ్యాయి. కలలు కల్లలయ్యాయి. వర్తమానమే కాదు, భవిష్యత్తు కూడా అంధకారమని అర్థమవుతున్నది. బాధ్యతలు రోజురోజుకూ బరువెక్కుతున్నాయి. ఆరోగ్యం అనుక్షణం హెచ్చరిస్తున్నది. జీవితంపై విరక్తి కలుగుతున్న పరిస్థితి నెలకొన్నది. మోసపోయి ఘోష పడుతున్నామన్న ఆవేదన. కనుచూపు మేరలో ఆశాకిరణం కనపడడం లేదు. ఇన్నాళ్ల నిస్వార్థ సేవకు ప్రతిఫలం ఇదేనా అని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు నిలదీస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం లేదు. తాము వేసిన ఒక్కొక్క ఓటు తమ జీవితాలను కోలుకోకుండా దెబ్బ తీసింది అన్న ఆవేదన పెన్షనర్లను వేధిస్తున్నది. చేసిన తప్పును సరిదిద్దుకోలేని పరిస్థితి వారిది. ఇంకా ఎంతకాలం ఈ నిరీక్షణ? ఎదురుచూపులు ఎండమావులేనా అనే భయం వెన్నాడుతోంది. అవును 61 ఏండ్ల వయసు తరువాత పదవీ విరమణ చెందిన ఉద్యోగులు వారికి రావాల్సిన బకాయిల గురించి చెందుతున్న ఆందోళన వర్ణనాతీతం. ధర్నాలు చేస్తే ప్రభుత్వం అరెస్టులకు దిగుతున్నది. విజ్ఞాపనలు బుట్ట దాఖలవుతున్నాయి. ప్రాతినిధ్యాలు పని చేయడం లేదు. అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీలు పెన్షనర్ల బకాయిల చెల్లింపు గురించి అడిగినా, చివరకు హెచ్చరించినా ప్రభుత్వం మౌనముద్ర వహిస్తున్నది. నిరసనలకు, నిరాహారదీక్షలకు కనీస స్పందన లేదు. కోర్టు ఉత్తర్వులను కూడా ఖాతరు చేయని పరిస్థితి. అంటే పెన్షనర్ల పట్ల ప్రభుత్వం చాలా చులకన భావంతో ఉన్నట్లు స్పష్టమవుతున్నది. రెండేండ్ల క్రితం పెన్షనర్ల ఓట్లు మాత్రం కాంగ్రెస్ పార్టీకి కావాల్సి వచ్చింది. మళ్లీ ఐదేండ్లకు వారిని ఏదో విధంగా మభ్యపెట్టి వాళ్ల ఓట్లు దండుకోవచ్చునని దూ(దు)రాలోచన. నాడు కాళ్ళకు బలపాలు కట్టుకుని కాంగ్రెస్ కోసం ప్రచారం చేసిన మేధావి వర్గం నేడు ప్రభుత్వంతో చర్చిస్తాం అన్న ప్రకటనలకే పరిమితమైంది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు సహజంగానే ప్రభుత్వాలకు బాసటగా నిలుస్తారు. ఏ ప్రభుత్వమైనా తమ ఉద్యోగుల బాగోగులు చూసుకోవడంలో రాజీ పడబోదు. 20 ఏండ్ల తర్వాత తెలంగాణలో అధికారం చేజిక్కించుకోవడానికి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఉద్యోగులకు, పెన్షనర్లకు హామీల వర్షం కురిపించింది. అమలులో ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని, పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటిస్తామని, ఆరు నెలల్లో పీఆర్సీ అమలు చేస్తామని, ఆరోగ్య కార్డులు ఇస్తామని, 317 జీవో బాధితులు తదితర అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని ఇచ్చిన హామీలను ఉద్యోగులు, పెన్షనర్లు అమాయకంగా నమ్మి తమ మద్దతు తెలిపారు. క్రమంగా ప్రభుత్వ వైఖరి బట్టబయలైంది. మోసపోయిన ఉద్యోగులు పెన్షనర్లకు రెండేండ్లకు ఒక్క డీఏ విదిల్చింది. పీఆర్సీ నివేదిక అందుకునే సాహసమే చేయడం లేదు. పాత పెన్షన్ విధానం గూర్చి మాట మాత్రమైనా పలకడం లేదు.ఆరోగ్య కార్డు పథకం రకరకాల కారణాలతో అటకెక్కింది. నెలకు రూ.500 కోట్లు విడుదల చేసి ఉద్యోగుల పెన్షనర్ల ఆర్థిక డిమాండ్లు నెరవేర్చుతామన్న ప్రభుత్వం పది నెలల్లో కేవలం మూడుసార్లు మాత్రమే విడుదల చేసింది. అందులో పెన్షనర్లకు దక్కింది 15% కూడా లేదు. విడుదల చేసిన దానిలో



కేవలం మెడికల్ బిల్లులు మాత్రమే ఉన్నాయి. సహనం నశించిన వారు కోర్టు నుండి ఉత్తర్వులు తెచ్చుకున్నా వారికి కూడా పెద్దగా చెల్లింపులు జరగడం లేదు. మరోవైపు బకాయిల చెల్లింపునకు ఆర్థిక శాఖలో మామూళ్ల పర్వానికి తెరలేపారు. మరణించిన వారి అంత్యక్రియలకు చెల్లించే రూ.30 వేలు కూడా విడుదల చేయకపోవడం దారుణం. మొత్తం పెన్షనర్లకు 21 నెలల కాలానికి రూ.13,500 కోట్లు విడుదల చేస్తే వారు రోడ్డెక్కే పరిస్థితి రానే రాదు. కానీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా కూడా లేదు. రాష్ట్రంలో గత రెండేండ్లలో దాదాపు 40 మంది పెన్షనర్లు ఆర్థిక భారం భరించలేక ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ రకమైన పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలో కాని, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కాని ఏర్పడలేదు. ప్రభుత్వానికి ఆర్థిక నియంత్రణ లోపించడమే ఇందుకు ప్రధాన కారణం. ప్రాధాన్యతలు పక్కదారి పట్టడంతో ప్రభుత్వం జవాబు చెప్పలేని పరిస్థితిలో ఉన్నది. నాటి ఓడ మల్లయ్యలు నేడు బోడి మల్లయ్యలయ్యారు.'ఆర్థిక స్థితి బాగాలేదు, అప్పు పుట్టడం లేదు, నన్ను కోసుకు తిన్నా పైసా రాదు, ఒకటవ తేదీనే జీతాలు ఇస్తున్నాం సంతోషించండి' అంటూ పలికిన ముఖ్యమంత్రి అందాల పోటీలకు, గ్లోబల్ సమ్మిట్ పేరుతోనూ మనవడి సరదా కోసం ఫుట్‌బాల్ మ్యాచ్ ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాలకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం ఏ రకమైన ఆర్థిక స్థితిని తెలియజేస్తుంది? ఇందులో ప్రజలకైనా, రాష్ట్రానికైనా ఏం ఒరిగింది? ప్రభుత్వమే అప్రతిష్టపాలైంది. అయినా ఇంకా ఉద్యోగులను, పెన్షనర్లను సర్దుకుపొమ్మని సలహా ఇవ్వడం ఆశ్చర్యకరం. ప్రజాసేవ చేస్తున్నామని చెప్పుకుంటున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ జీతభత్యాలను ఒక నెల త్యాగం చేస్తే వారికి ఉద్యోగ వర్గాల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల ఈతి బాధలు తెలుస్తాయి. కానీ ఉద్యోగులు సౌమ్యులు. ఇలాంటి డిమాండ్ ఏనాడూ చేయడం లేదు. తమ ఆరోగ్యం కోసం ఖర్చు చేసిన మెడికల్ బిల్లులు, తాము దాచుకున్న జీపీఎఫ్, జీఎల్ఐసీ సొమ్ము వెంటనే చెల్లించాలని కోరుతున్నారు. పదవీ విరమణ పొందిన వారి హక్కు అయన గ్రాట్యుటీ, కమ్యుటేషన్ బకాయిలను విడుదల చేయమని ప్రభుత్వాన్ని అడుగుతున్నారు. ప్రతిరోజు జిల్లాలలో పెన్షనర్లు ఆందోళన చేస్తున్నా, కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పిస్తున్నా ప్రభుత్వం చెవులు, కళ్లు మూసుకుంది. ఐదు డీఏలు పెండింగ్ ఉన్న రాష్ట్రంగా దేశంలో రికార్డు సృష్టించింది తెలంగాణ. ఇంత బాధ్యతారహితమైన ప్రభుత్వాన్ని మొదటిసారిగా ప్రజలు 'మార్పు' పేరున తెచ్చుకున్నందుకు శిక్షను అనుభవించాల్సి వస్తున్నది. 'ప్రజలకు ఇచ్చే ఏ సంక్షేమ పథకాన్ని అయినా నిలిపివేసి ఉద్యోగుల, పెన్షనర్ల బకాయిలు చెల్లించాలి' అంటూ స్వయంగా ముఖ్యమంత్రి ప్రజలను వారికి వ్యతిరేకంగా రెచ్చగొట్టినట్లుగా

మాట్లాడడం రాజనీతి కాదు.

ప్రజలు విజ్ఞులు కాబట్టే ఆయన వ్యాఖ్యలకు అనుకూల స్పందన రాలేదు. ఎందుకంటే ఉద్యోగ పెన్షనర్లు ప్రజల్లో భాగమే. అందరూ నేటి ప్రభుత్వ బాధితులే. ఓపిక నశించిన పెన్షనర్లు రోడ్డెక్కడం లేదా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. సంక్షేమం తమ మొదటి ప్రాధాన్యతగా చెప్పుకునే నేటి పాలకులు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమం నిర్లక్ష్యం చేయడాన్ని సదరు వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. జాతీయ మానవ హక్కుల కమిషన్ కూడా రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి ఎనిమిది వారాల గడువిస్తూ పెన్షనర్ల సమస్యలను తీర్చాలని ఆదేశించింది. ఏమి అద్భుతాలు జరుగుతాయో వేచి చూద్దాం.మాటల్లోనూ, చేతల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వ డొల్లతనం బహిర్గతమైంది. ఇక ఇందుకు విరుగుడుగా ఉద్యోగుల పదవీ విరమణ వయసును పెంచే దిశగా ఆలోచిస్తున్నట్లు, రహస్యంగా జీవో విడుదలకు ప్రయత్నాలు చేస్తున్నట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. పదవీ విరమణ వయసును పెంచితే భవిష్యత్తులో బకాయిలు మరింత పేరుకుపోయి ప్రభుత్వం చేతులెత్తేసే పరిస్థితి ఏర్పడవచ్చు. కానీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం మాత్రం కనుచూపుమేరలో లేదు. మరి అదే నిజమైతే నాడు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు తప్పు, అబద్ధం అని ప్రజల సాక్షిగా ఒప్పుకున్నట్లే. అదేవిధంగా పదవీ విరమణ వయస్సు పెంపు విషయంలో నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్లే అవుతుంది. వారి జీవితాలతో ఆడుకున్నట్లే అవుతుంది. నోటిఫికేషన్లు ఇచ్చి వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఎన్ని నియామకాలు చేపట్టిందో మనకు తెలుసు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు తతంగం పూర్తయిన తర్వాత కేవలం నియామక పత్రాలను అట్టహాసంగా ఇచ్చి తామే చేసినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటు. రెండేండ్లు గడిచినా నేటి వరకు నోటిఫికేషన్లు ఇచ్చింది లేదు, పోస్టులు నింపింది లేదు! ఇప్పుడు నిరుద్యోగులను కూడా దగా చేసే ప్రయత్నం చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లతో ఈ విధంగా ఆడుకుంటుంటే కేంద్ర ప్రభుత్వం కూడా తానేమీ తక్కువ తినలేదు అన్నట్లు ప్రవర్తిస్తున్నది. వారి నెత్తిన పిడుగు పడవేయడానికి సిద్ధంగా ఉన్నది.

## ఎలక్ట్రిక్ కారా.. మజాకా.. ఒక్కసారి ఛార్జింగ్‌తో 792 కి.మీ రేంజ్!

**ఈ కంపెనీ అద్భుతమైన ఎలక్ట్రిక్ కారును మార్కెట్లో విడుదల చేసింది. రెండు వేరియట్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. రెండు వేరియంట్లలో కూడా దాదాపు ఒకే రకమైన ఫీచర్లు ఉంటాయి. ముఖ్యంగా జూూ 200 మోడల్‌లో స్టైలింగ్ అందుబాటులో ఉంటుంది..**



జర్మనీకి చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ భారత మార్కెట్లో మరో కొత్త ఎలక్ట్రిక్ కారును ప్రవేశపెట్టింది. దేశంలో పెరుగుతున్న లగ్జరీ ఎలక్ట్రిక్ వాహనాల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కంపెనీ అనే కొత్త సెడాన్‌ను మంగళవారం విడుదల చేసింది. ఈ కొత్త ఎలక్ట్రిక్ సెడాన్ కంపెనీకి చెందిన పెద్ద జూ సిరీస్ మోడళ్ల కంటే దిగువ స్థాయిలో ఉండే ప్రీమియం వాహనంగా మార్కెట్లోకి తీసుకొచ్చింది. జర్మనీకి చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ భారత మార్కెట్లో మరో కొత్త ఎలక్ట్రిక్ కారును ప్రవేశపెట్టింది. దేశంలో పెరుగుతున్న లగ్జరీ ఎలక్ట్రిక్ వాహనాల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కంపెనీ అనే కొత్త సెడాన్‌ను మంగళవారం విడుదల చేసింది. ఈ కొత్త ఎలక్ట్రిక్ సెడాన్ కంపెనీకి చెందిన పెద్ద జూ సిరీస్ మోడళ్ల కంటే దిగువ స్థాయిలో ఉండే ప్రీమియం వాహనంగా మార్కెట్లోకి తీసుకొచ్చింది. రెండు వేరియంట్లలో అందుబాటులో..: జూూ ఎలక్ట్రిక్ కారు రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంటుంది. జూూ 200 అయితే ధర విషయానికొస్తే దేశవ్యాప్తంగా షోరూమ్ ధరలు ఇలా ఉన్నాయి. జూూ 200 ఖ్ఉఅఝతీఱ ఝఅస్త్రవ సుమారు రూ.55 లక్షలు, 250 సుమారు రూ.59 లక్షలు. వివిధ రేంజ్ ఆప్షన్లు, ధరలతో రెండు వేరియంట్లను అందించడం ద్వారా ప్రీమియం ఎలక్ట్రిక్ సెడాన్ కొనుగోలు చేయాలనుకునే విభిన్న వర్గాల కస్టమర్లను ఆకర్షించాలనే లక్ష్యంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. రెండు వేరియంట్లలో అందుబాటులో..: జూూ ఎలక్ట్రిక్ కారు రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంటుంది. జూూ 200 ఖ్ఉఅఝతీఱ ఝఅస్త్రవ, జూూ 250+ అయితే ధర విషయానికొస్తే దేశవ్యాప్తంగా షోరూమ్ ధరలు ఇలా ఉన్నాయి. జూూ 200 ఖ్ఉఅఝతీఱ ఝఅస్త్రవ సుమారు రూ.55 లక్షలు, జూూ 250+ సుమారు రూ.59 లక్షలు. వివిధ రేంజ్ ఆప్షన్లు, ధరలతో రెండు వేరియంట్లను అందించడం ద్వారా ప్రీమియం ఎలక్ట్రిక్ సెడాన్ కొనుగోలు చేయాలనుకునే విభిన్న వర్గాల కస్టమర్లను ఆకర్షించాలనే లక్ష్యంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. కస్టమర్ల అభిప్రాయంతో స్టాండర్డ్ మోడల్: మెర్సిడెస్ బెంజ్ తెలిపిన ప్రకారం, తక్కువ ధరలో ఎలక్ట్రిక్ సెడాన్ కావాలని కోరుకున్న వినియోగదారుల అభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకుని జూూ 200 ఖ్ఉఅఝతీఱ ఝఅస్త్రవ మోడల్‌ను ప్రవేశపెట్టింది. అయితే ధర తక్కువ అయినప్పటికీ ఆధునిక ఎలక్ట్రిక్ టెక్నాలజీ, ఫీచర్లలో ఎలాంటి రాజీ పడలేదని కంపెనీ పేర్కొంది.

కస్టమర్ల అభిప్రాయంతో స్టాండర్డ్ మోడల్: మెర్సిడెస్ బెంజ్ తెలిపిన ప్రకారం, తక్కువ ధరలో ఎలక్ట్రిక్ సెడాన్ కావాలని కోరుకున్న వినియోగదారుల అభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకుని జూూ 200 ఖ్ఉఅఝతీఱ ఝఅస్త్రవ మోడల్‌ను ప్రవేశపెట్టింది. అయితే ధర తక్కువ అయినప్పటికీ ఆధునిక ఎలక్ట్రిక్ టెక్నాలజీ, ఫీచర్లలో ఎలాంటి రాజీ పడలేదని కంపెనీ పేర్కొంది.

బుకింగ్ వివరాలు:

ఈ కారును కొనుగోలు చేయాలనుకునే వారు రూ.1.5 లక్షల డౌన్‌పేమెంట్‌తో ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. డెలివరీలు కూడా త్వరలోనే ప్రారంభం కానున్నాయి.250+ వేరియంట్ డెలివరీలు ఏప్రిల్ చివరి నుండి ప్రారంభం అవుతాయి. అలాగే జూూ 200 వేరియంట్ డెలివరీలు జూన్ నుండి ప్రారంభమవుతాయి.

బుకింగ్ వివరాలు:

ఈ కారును కొనుగోలు చేయాలనుకునే వారు రూ.1.5 లక్షల డౌన్‌పేమెంట్‌తో ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. డెలివరీలు కూడా త్వరలోనే ప్రారంభం కానున్నాయి.జూూ 250+ వేరియంట్ డెలివరీలు ఏప్రిల్ చివరి నుండి ప్రారంభం అవుతాయి. అలాగే జూూ 200 వేరియంట్ డెలివరీలు జూన్ నుండి ప్రారంభమవుతాయి.

బ్యాటరీ, రేంజ్ వివరాలు:

జూూ ఎలక్ట్రిక్ కారు ప్లాట్‌ఫారంపై రూపొందించింది. ఈ కారులో 800 వోల్ట్ ఎలక్ట్రిక్ ఆర్కిటెక్చర్ ఉపయోగించారు. వేరియంట్‌లో 85 ఎఔష్ట్ర బ్యాటరీ ఉంటుంది. ఇది ఒకసారి ఫుల్ చార్జ్ చేస్తే గరిష్టంగా సుమారు 792 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని కంపెనీ తెలిపింది. జూూ 200 వేరియంట్‌లో ఫుల్ చార్జ్‌తో సుమారు 542 కిలోమీటర్ల రేంజ్ లభిస్తుంది.

బ్యాటరీ, రేంజ్ వివరాలు:

జూూ ఎలక్ట్రిక్ కారు ప్లాట్‌ఫారంపై రూపొందించింది. ఈ కారులో 800 వోల్ట్ ఎలక్ట్రిక్ ఆర్కిటెక్చర్ ఉపయోగించారు. జూూ 250+ వేరియంట్‌లో 85 ఎఔష్ట్ర బ్యాటరీ ఉంటుంది. ఇది ఒకసారి ఫుల్ చార్జ్ చేస్తే గరిష్టంగా సుమారు 792 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని కంపెనీ తెలిపింది. జూూ 200 వేరియంట్‌లో ఫుల్ చార్జ్‌తో సుమారు 542 కిలోమీటర్ల రేంజ్ లభిస్తుంది.

ఫాస్ట్ చార్జింగ్ సదుపాయం:

ఈ కారులో ఉన్న 800 వోల్ట్ ఎలక్ట్రిక్ సిస్టమ్ వల్ల అల్ట్రా ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ ఉంటుంది. ఇజ ఫాస్ట్ చార్జర్ ద్వారా కేవలం 20 నిమిషాల్లోనే 320 నుండి 400 కిలోమీటర్ల వరకు డ్రైవింగ్ రేంజ్ పొందవచ్చు. ఫీచర్లు: రెండు వేరియంట్లలో కూడా దాదాపు ఒకే రకమైన ఫీచర్లు ఉంటాయి. ముఖ్యంగా జూూ 200 మోడల్‌లో ూతీశ్స్త్రతీవంఱజవ ూఱఅవ స్టైలింగ్ అందుబాటులో ఉంటుంది. దీనిలో కంఫర్ట్ సీట్లు లి మల్టీఫంక్షన్ స్పోర్ట్స్ లెదర్ స్టీరింగ్ వీల్, లి రెండు ట్రిమ్ ఆప్షన్లు వంటి ఫీచర్లు ఉన్నాయి. ప్రత్యేక ఆఫర్: ఈ కారును ముందుగానే బుక్ చేసుకునే వినియోగదారులకు కంపెనీ లిలివాల్ బాక్స్ ఛార్జర్‌లిలిను ఉచితంగా అందించనున్నట్లు ప్రకటించింది. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల డిమాండ్ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో వీవతీఛెవఎవం-దీవఅఓ జూూ జుశ్రీవఛ్తీఱఅఝ లాంటి ప్రీమియం ఎలక్ట్రిక్ సెడాన్‌లు మార్కెట్లో మరింత పోటీని పెంచే అవకాశం ఉందని ఆటోమొబైల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు

ఫాస్ట్ చార్జింగ్ సదుపాయం:

ఈ కారులో ఉన్న 800 వోల్ట్ ఎలక్ట్రిక్ సిస్టమ్ వల్ల అల్ట్రా ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ ఉంటుంది. ఇజ ఫాస్ట్ చార్జర్ ద్వారా కేవలం 20 నిమిషాల్లోనే 320 నుండి 400 కిలోమీటర్ల వరకు డ్రైవింగ్ రేంజ్ పొందవచ్చు. ఫీచర్లు: రెండు వేరియంట్లలో కూడా దాదాపు ఒకే రకమైన ఫీచర్లు ఉంటాయి. ముఖ్యంగా జూూ 200 మోడల్‌లో స్టైలింగ్ అందుబాటులో ఉంటుంది. దీనిలో కంఫర్ట్ సీట్లు లి మల్టీఫంక్షన్ స్పోర్ట్స్ లెదర్ స్టీరింగ్ వీల్, లి రెండు ట్రిమ్ ఆప్షన్లు వంటి ఫీచర్లు ఉన్నాయి. ప్రత్యేక ఆఫర్: ఈ కారును ముందుగానే బుక్ చేసుకునే వినియోగదారులకు కంపెనీ లిలివాల్ బాక్స్ ఛార్జర్‌లిలిను ఉచితంగా అందించనున్నట్లు ప్రకటించింది. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల డిమాండ్ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో లాంటి ప్రీమియం ఎలక్ట్రిక్ సెడాన్‌లు మార్కెట్లో మరింత పోటీని పెంచే అవకాశం ఉందని ఆటోమొబైల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు

## బుక్ చేసుకున్నా డెలివరీ అవ్వలేదా..

## ఈ నెంబర్లకు కాల్ చేస్తే మీ పని పూర్తి.. సేవ్ చేసి పెట్టుకోండి..

**గ్యాస్ సిలిండర్లపై కేంద్రం కొత్త రూల్స్ జారీ చేసింది. 25 రోజుల వెయిటింగ్ పీరియడ్ విధించడంతో పాటు బుక్ చేసుకున్నవారికి రెండున్నర రోజుల్లోనే డెలివరీ చేస్తామని వెల్లడించింది. డెలివరీ కాకపోతే ఫిర్యాదు చేసేందుకు హెల్ప్ లైన్ నెంబర్లను కూడా అందుబాటులోకి తెచ్చారు.**

దేశంలో గ్యాస్ కొరత క్రమంలో ప్రజలు అప్రమత్తమవుతున్నారు. సంక్షోభం మరింత ముదిరే అవకాశం ఉన్న క్రమంలో ముందుగానే గ్యాస్ బుక్ చేసుకుని నిల్వ చేసి పెట్టుకుంటున్నారు. రెండు సిలిండర్లు ఉన్నవారు రీఫిల్లింగ్ కోసం బుకింగ్ చేసుకుంటున్నారు. ఇక ఒక గ్యాస్ మాత్రమే వాడేవారు మరో గ్యాస్ సిలిండర్ కొత్తగా తీసుకుంటున్నారు. ఈ క్రమంలో దేశంలో గ్యాస్ సిలిండర్ల బుకింగ్స్ ఒక్కసారిగా పెరిగిపోగా.. ఆయిల్ కంపెనీల సర్వర్లు కూడా డౌన్ అవుతున్నాయి. ఈ క్రమంలో అదనపు సిలిండర్లను బుక్ చేసుకోవడానికి తొందరపడవద్దని, ప్రజలు భయపడవద్దని కేంద్రం సూచిస్తోంది. గృహ వినియోగదారులకు సరఫరా చేసేందుకు ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేసింది. అయితే రానున్న రోజుల్లో గ్యాస్ దొరకదనే ఆందోళన ప్రజల్లో నెలకొంది.

గ్యాస్ అందకపోతే ఫిర్యాదు చేయొచ్చు

డొమెస్టిక్ గ్యాస్ వినియోగదారులు భయాందోళన పడాల్సిన అవసరం లేదని కేంద్రం తెలిపింది. బుక్ చేసుకున్న రెండున్నర రోజుల్లోనే డెలివరీ చేసేందుకు స్పష్టం చేసింది. అయితే డెలివరీ అవ్వకపోతే ఫిర్యాదు చేసేందుకు ఆయిల్ కంపెనీలు హెల్ప్ లైన్ నెంబర్లను కూడా అందుబాటులోకి తెచ్చాయి. ఇండేన్ గ్యాస్ వాడే కస్టమర్లు 1800-2333-555 (టోల్ ఫ్రీ), 7718955555 నెబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. ఇక భారత్ గ్యాస్ వినియోగదారులు 1800-22-4344 (టోల్ ఫ్రీ), 7715012345 నెంబర్లకు కాల్ చేయాలని సూచించింది. హెచ్‌పీ గ్యాస్ వాడేవారు1800-2333-555 (టోల్ ఫ్రీ), 9493602222 నెంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించింది. 24 గంటల పాటు ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేశాయి. కస్టమర్లు ఫిర్యాదు చేస్తే సిబ్బంది స్పందించి గ్యాస్ త్వరగా డెలివరీ అయ్యేల చర్యలు తీసుకుంటారని స్పష్టం చేసింది.

అదనపు డబ్బు డిమాండ్ చేస్తే..

ఇక గ్యాస్ కోసం అదనపు డబ్బులు డిమాండ్ చేస్తే వినియోగదారులు ఫిర్యాదు చేయాలని ఆయిల్ కంపెనీలు చెబుతున్నాయి. గ్యాస్ కొరత వల్ల డెలివరీ చేయడానికి కొంతమంది గ్యాస్ డీలర్లు అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇలా అదనంగా డబ్బులు వసూలు చేయడం చట్టవిరుద్దమని, ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలని కంపెనీలు కోరుతున్నాయి. ఇక బ్లాక్ మార్కెట్ లేదా అక్రమ మార్గంలో గ్యాస్ డెలివరీ చేసే డీలర్లపై చర్యలు తీసుకుంటామని కేంద్రం హెచ్చరించింది. డీలర్లు ఏమైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే వినియోగదారులు హెల్ప్ లైన్ నెంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించింది. అటు కొంతమంది అక్రమార్కులు రూ.960గా ఉన్న గ్యాస్ సిలిండర్‌ను రూ.1500కి విక్రయిస్తున్నారు. ఇలాంటివారిపై అధికారులు దృష్టి పెట్టి సిలిండర్లను సీజ్ చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో పలువురి వద్ద అక్రమ సిలిండర్లను సీజ్ చేశారు.

# పిల్లల్లో ఊబకాయ సమస్య! - ప్రపంచంలో రెండో స్థానంలో భారత్!!

### 2040 కల్లా భారత్ లో 2 కోట్ల మంది చిన్నారులకు ఒబెసిటీ - స్పష్టం చేసిన తాజా అధ్యయనం!



ఆధునిక జీవనశైలి, ఆహార మార్పులతో పెద్దల్లోనే కాదు పిల్లల్లోనూ ఒబెసిటీ పెరుగుతోంది. ఊబకాయం వల్ల పెద్దవారికి వచ్చే గుండెపోటు, కొలెస్ట్రాల్, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులు.. పిల్లలకు చిన్నవయసులోనే రావడం వల్ల మరణాలూ సంభవిస్తున్నాయి. ఈ క్రమంలో వరల్డ్ ఒబెసిటీ అట్లాస్ 2026 నివేదిక ప్రకారం ప్రపంచంలో అత్యధిక మంది ఊబకాయ పిల్లలు ఉన్న దేశాల జాబితాలో భారత్ ది రెండో స్థానంలో నిలిచింది. చైనా ఫస్ట్ ప్లేస్ లో ఉంది. మరి, పిల్లల్లో ఒబెసిటీకి కారణాలు? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? లాంటి విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం! చిన్నారుల్లో ఒబెసిటీని నిరోధించాలనే లక్ష్యాన్ని అందుకోవడంలో భారత్‌తో సహా పలు దేశాలు విఫలమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. 2025 నాటికి ఈ లక్ష్యాన్ని సాధించాలని ఆశించినా నెరవేరకపోవడంతో గడువును 2030కి పొడిగించారు. ఈ సంస్థ విడుదల చేసిన వరల్డ్ ఒబెసిటీ అట్లాం 2026 నివేదిక ప్రకారం.. 2040 కల్లా భారత్ లో 2 కోట్ల మంది బాలలు ఒబెసిటీతో, 5.6 కోట్ల మంది అధిక బరువుతో బాధపడతారని పేర్కొంది. 2025 నాటికి చైనా, భారత్ అమెరికాలో ఒక్కో దేశంలో కోటి కంటే ఎక్కువ మంది చిన్నారులు ఒబెసిటీతో బాధపడుతున్నారని తాజా నివేదికలో వెల్లడైంది. చైనాలో అత్యధికంగా 6.2 కోట్ల మంది పిల్లలు అధిక (శారీర ఎత్తు, బరువు సూచీ)తో, 3.3 కోట్ల మంది ఒబెసిటీతో బాధపడుతున్నారట. అదే, భారత్ లో 4.1 కోట్ల మంది అధిక దీవీ×తో, 1.4 కోట్ల మంది ఒబెసిటీతో ఉన్నారు. ఈ క్రమంలో 2040 నాటికి ప్రపంచమంతటా 50.7 కోట్ల మంది చిన్నారులు ఊబకాయంతోనో, అధిక బరువుతోనో జీవిస్తారని ఔశితీశ్రీఎ ూఎవంఎ ఖీవఎవతీఖఅశీఱ అంచనా.

కారణాలు ఒకటి కాదు :

ఒబెసిటీకి అనేక కారణాలు ఉంటాయంటున్నారు నిపుణులు. సరైన ఆహారం తీసుకోకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, పోషకాల అసమతౌల్యత, వేళ తప్పిన తిండి, జన్యుపరమైన సమస్యలు, థైరాయిడ్, పీసీఓఎస్, జీవక్రియల్లో లోపం, హార్మోన్లు సరిగా పని చేయకపోవడం, జీర్ణాశయ సమస్యలు, పర్యావరణ మార్పులు, ప్లాస్టిక్ వినియోగం, తినే వాటిపై పురుగు మందుల అవశేషాలు, నిల్వ కారకాల ప్రభావానికి లోనవడం లాంటివి ఊబకాయానికి కారణమవుతాయని నిపుణులు చెబుతున్నారు. గర్భంతో ఉన్నప్పుడు తల్లి బరువు, అప్పుడు తనకి డయాబెటిస్ ఉందా, పుట్టినప్పుడు బిడ్డ బరువు వంటివీ చూస్తారని పేర్కొంటున్నారు. నిద్రలేమి, అబ్ స్ట్రక్టివ్ స్లీప్ యాప్నియా లాంటివి ఒబెసిటీకి కారణమవుతాయని తెలియజేస్తున్నారు. కార్టిసోల్ అధికంగా ఉండటం వల్ల వచ్చే కుషింగ్ సిండ్రోమ్ కూడా ఒబెసిటీకి కారణం కావచ్చట. 11-17 ఏళ్ల వయసు పిల్లలకు తగినంత శారీరక శ్రమ, వ్యాయామం లేకపోవడం ఊబకాయానికి కారణమని తాజా నివేదికలో పేర్కొంది. సెల్ ఫోన్ వాడుతూ, టీవీల ముందు కూర్చోవడం వల్ల సమస్య తీవ్రతరం అవుతోందట. అలాగే, 6-10 ఏళ్ల లోపు చిన్నారులు చక్కెర ఎక్కువగా వాడే శీతల పానీయాలు, ఐస్ క్రీమ్ లు, ప్రాసెస్డ్ ఫుడ్స్, సాల్టెడ్ చిప్స్, ఫ్రై కూరలనే ఇష్టపడతారని, వీటి వల్ల బరువు పెరుగుతారని తెలిపింది. 'కళ్లు తిరగడం, తలనొప్పి'గా ఉంటోందా? - మీరూ ఈ తప్పు చేస్తున్నారేమో చెక్ చేసుకోండి!

గుర్తించిన సమస్యలివీ :

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం.. దేశంలో 9-17 ఏళ్ల లోపు పిల్లలు సమగ్ర పోషకాహారం తీసుకోవడం లేదు. 70% మంది పాఠశాలల్లో లేదా సమీపంలోని దుకాణాల్లో ప్యాకేజ్డ్ ఆహారం తీసుకుంటున్నారు. స్కూల్ కు టిఫిన్ బాక్సులు తీసుకు వెళ్లినా, సగం తినకుండా వదిలేసి జంక్ ఫుడ్ తింటున్నారని నిపుణులు చెబుతున్నారు. దీంతో పిలల్లో ఒబెసిటీ, రక్తహీనత, విటమిన్ ూ లోపం, తక్కువ బరువు, బలహీనంగా మారడం, రక్తంలో కొలెస్ట్రాల్ లాంటి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో బాల్య ఊబకాయం మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్‌కు దారితీస్తుందని ర్నల్ ప్రచురించింది. పిల్లలు చిన్నతనం నుంచి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు అలవాటు పడడం వల్ల కూడా వారు టీనేజీకి వచ్చేసరికి ఒబెసిటీ బారిన పడుతున్నారు. టీవీ చూడడం, మొబైల్స్, పీసీలో ఆటలాడడం వంటివన్నీ కూర్చొని చేసేవే. ఇలా రోజులో అధిక సమయం కూర్చోవడం వల్ల వారు బరువు పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

పరిష్కారాలు :

వీలైనంత వరకూ జీవనశైలి మార్పులతోనే సమస్యను పరిష్కరించుకోవాలంటున్నారు నిపుణులు.మంచి ఆహారం : కుటుంబంగా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి, వయసు పెరిగే కొద్దీ ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి సహాయపడుతుందని అధ్యయనం పేర్కొంది. పోషకాహార సిఫార్సులను అనుసరించే వివిధ రకాల ప్రోటీన్లు, పాల ఉత్పత్తులు (చక్కెరలు జోడించకుండా), కూరగాయలు, పండ్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, తృణధాన్యాలు తినడం వల్ల పిల్లలు, పెద్దలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపింది.

వ్యాయామం :

భారతీయ చిన్నారుల్లో ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఎక్కువగా ఉంటుందంటున్నారు నిపుణులు. అందుకే, రోజూ కనీసం 30-60 నిమిషాల వ్యాయామం, అదీ ఆరుబయట తప్పనిసరని చెబుతున్నారు. చిన్న వయసు నుంచి యోగా నేర్పడం మంచిదని సూచిస్తున్నారు. దీనివల్ల రక్తప్రసరణ, ఫ్లెక్సిబిలిటీ మెరుగుపడతాయని తెలియజేస్తున్నారు. అలాగే, శరీరానికి తగినంత శ్రమ ఉండేలా ఇంట్లో చిన్న పనులు చేయించాలని చెబుతున్నారు. పార్కుల్లో పిల్లలతో ఆడుకునేలా చూసుకోవాలని తెలియజేస్తున్నారు. దీంతో కండరాలు కదులుతాయని, ఎముకలు దృఢంగా మారతాయని పేర్కొంటున్నారు. నిద్ర : పిల్లలకు కనీసం 9-10 గంటల నిద్ర అవసరమంటున్నారు నిపుణులు. నిద్ర సరిపోకపోయినా ఊబకాయం వస్తుందని హెచ్చరిస్తున్నారు. శరీరం అలసిపోతే ప్రశాంతంగా పడుకుంటారని తెలియజేస్తున్నారు. అలాగే, నిద్రకు 2 గంటల ముందే మొబైల్, టీవీలను వీలైనంత దూరంగా ఉంచాలని సూచిస్తున్నారు. నీరు తాగడం : శరీరం డీ హైడ్రేషన్ కి గురైనప్పుడు శక్తిస్థాయిలు క్షీణించి అలసిపోతాం. ఆ అలసటను తీర్చుకునే క్రమంలో కంటికి కనిపించిన ఏదో ఒకటి లాగించేస్తామట. ఫలితంగా, బరువు పెరుగుతామంటున్నారు నిపుణులు. అలా జరగకుండా ఉండాలంటే, నీళ్లు ఎక్కువగా తాగేలా పిల్లల్ని ప్రోత్సహించాలని చెబుతున్నారు. ఈ క్రమంలో వారికి తాజా పండ్లు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటివీ అందించచ్చని సూచిస్తున్నారు. మైండ్ ఫుల్ ఈటింగ్ : ఏం తింటున్నాం, ఎంత తింటున్నాం, ఎప్పుడు, ఎలా తింటున్నాం అన్న విషయాల్లో పిల్లలకు అవగాహన కల్పించాలంటున్నారు నిపుణులు. తింటున్న ఆహారం పట్ల ఇష్టం, ధ్యాస ఉండాలని, తినకుండానే రుచిని నిర్ణయించకూడదని చెప్పాలని చెబుతున్నారు. రుచిని ఆస్వాదించడం, ఆహారం ఎక్కువవుతోందా, ఆహారం సరిపోయిందా వంటివి గమనించుకోవడం నేర్పాలని సూచిస్తున్నారు. పిల్లలకు బలవంతంగా హెల్దీఫుడ్ పెట్టలేకపోవచ్చు. కానీ, వారికి నచ్చే విధంగా రంగు రంగుల కూరగాయలు కలిపి రోటీలు, రైస్ చేసి ఆకర్షించే విధంగా, ఆరోగ్యంగా తినిపించొచ్చని సలహా ఇస్తున్నారు సీజన్ కి తగ్గట్టు కూరగాయలు, పండ్లు పెట్టాలని సూచిస్తున్నారు. వాటితో కలిగే లాభాలేంటో పిల్లలకు కథల రూపంలో వివరించాలని తెలియజేస్తున్నారు. మన పూర్వీకులు ఎలాంటి ఆహారం తీసుకునేవారో చెప్పి ఆహారంపై ఆసక్తి కలిగించాలట. రాత్రిపూట 7 లోపే భోజనాన్ని ముగించాలట. ఒక నిర్దిష్ట బరువు లక్ష్యం మీద కాకుండా, మంచి ఆరోగ్యం మీద దృష్టి పెట్టాలని పేర్కొంది. తల్లిదండ్రులు పిల్లలకు ఆహారం, శారీరక శ్రమ పట్ల ఆరోగ్యకరమైన, సానుకూల దృక్పథాలను నేర్పించాలని తెలిపింది.నసిక ఒత్తిడి : ఒబెసిటీకి- డిప్రెషన్ కు దగ్గర సంబంధం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గడం ఒక్కటే మానసిక సమస్యల్ని పరిష్కరించదట. ఊబకాయం ఉన్న పిల్లల్లో డిప్రెషన్, యాంగ్జైటీ వచ్చే ముప్పు సాధారణ పిల్లల కంటే ఎక్కువగా ఉంటుందని వివరిస్తున్నారు. ఊబకాయం కేవలం శారీరక సమస్యే కాకుండా, వారిలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి, భావోద్వేగ సవాళ్లకు దారితీస్తుందని వీఖా× పేర్కొంది. ఇది వారి ఎదుగుదల, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలియజేస్తున్నారు. స్కూల్ లేదా ఆడుకునే స్థలాల్లో తోటి పిల్లల నుంచి ఎగతాళి, వెక్కిరింతలు, వివక్షను ఎదుర్కోవడం వల్ల పిల్లలు తీవ్రమైన మనస్తాపానికి గురవుతారని పేర్కొంటున్నారు. దీనివల్ల వారు ఇతరులతో కలవడానికి భయపడతారని చెబుతున్నారు. అలాగే, సామాజికంగా ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారని అంటున్నారు. తమ శరీర ఆకృతి పట్ల ప్రతికూల భావన ఏర్పడటం వల్ల పిల్లల్లో ఆత్మన్యూనతా భావం పెరుగుతుందంటున్నారు నిపుణులు. దీంతో తాము ఇతరుల కన్నా తక్కువ అనే భావన వారిలో ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుందని వివరిస్తున్నారు. ఊబకాయం ఉన్న పిల్లల్లో డిప్రెషన్, యాంగ్జైటీ వచ్చే ముప్పు సాధారణ పిల్లల కంటే ఎక్కువగా ఉంటుందని వివరిస్తున్నారు. అనుబంధాలు : ఒబెసిటీ పిల్లలో చాలా మానసిక ఒత్తిడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వారి ఆలోచనలు, భయాలు, ఆందోళన వంటివి తల్లిదండ్రులు, తోబుట్టువులతో నిస్సంకోచంగా చర్చించే వాతావరణాన్ని కల్పించాలంటున్నారు. వారు ధైర్యాన్నీ ఇవ్వాలని సలహా ఇస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# సరదాల పేరుతో "సర్వరోగ కారిణి" - జాగ్రత్తగా ఉండాలంటున్న నిపుణులు!



### మద్యం ఎంత తీసుకున్నా ఆరోగ్యానికి ప్రమాదమేనా - పరిశోధనలు ఏం చెప్తున్నాయంటే!

బర్త్‌ డే వస్తే పార్టీ. జాబ్ వస్తే పార్టీ. పెళ్లి కుదిరితే పార్టీ. ప్రమోషన్ వస్తే పార్టీ. ఫ్రెండ్స్ వస్తే పార్టీ. వారు విదేశాలకు వెళ్తే పార్టీ. ఇలా ఏదో ఒక కారణంతో మద్యం సేవించడం కామన్ అయ్యింది. ఇది మత్తు కలిగించటంతోనే ఆగదు. మెదడు దగ్గరి నుంచి పేగుల వరకూ శరీరమంతా ప్రతికూల ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. మద్యం దీర్ఘకాలంలో తీవ్ర అనర్థాలే తెచ్చిపెడుతుందని చెబుతున్నారు. ఈ క్రమంలో మద్యం వల్ల శరీరానికి ఎలాంటి హాని కలుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం!

మెదడుపై సత్వం ప్రభావం : మద్యం ప్రభావం మెదడు మీద చాలా వేగంగా పడుతుందంటున్నారు నిపుణులు. మొదట్లో ఒత్తిడి నుంచి ఉపశమనంగా, నలుగురితో కలివిడిగా ఉన్న భావన కలుగుతుందట. కానీ, రోజులు గడుస్తున్నా కొద్ది మద్యం మూలంగా మెదడు ఆకృతిలో మార్పులు వస్తుంటాయి. సగటున రోజుకు ఒక డ్రింకు తాగినా మధ్యవయసు వారిలో, వృద్ధుల్లో మెదడు పరిమాణం తక్కువగా ఉంటున్నట్టు పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఎంత ఎక్కువగా మద్యం తాగితే అంత ఎక్కువగా మెదడు కుంచించుకుపోవడం గమనార్హం. దీనికి కారణం ఏంటన్నది కచ్చితంగా తెలియదట. కానీ, మెదడుకు సంబంధించిన రోగనిరోధక వ్యవస్థను మద్యం మార్చేస్తుండొచ్చన్నది ఒక సిద్ధాంతం. ఇది ఇన్ ఫ్లమేషన్ ను ఉత్తేజితం చేసి, నాడీ కణాలను దెబ్బతీస్తుండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

నోటిపై నేరుగా :

మద్యం తాగినప్పుడు నోరు, గొంతులోని కణజాలాలు నేరుగా ప్రభావితమవుతాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో స్వల్ప మోతాదులో మద్యం తీసుకున్నా కూడా నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం 50 శాతం ఎక్కువనీ, నాటుసారా తాగితే ఆ ప్రమాదం 87 శాతానికి పెరుగుతుందని అధ్యయనం పేర్కొంది.

అంతేకాదు, మద్యం జీర్ణమయ్యే క్రమంలో అసిటలహైడ్ అనే విషపదార్థం పుట్టుకొస్తుంది. ఇది ఐచీూకు అంటుకొని కణాలను దెబ్బతీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా, నోరు, గొంతు, స్వరపేటిక, అన్నవాహిక క్యాన్సర్ల ముప్పు పెరుగుతుందని జవత్‌వతీం టశీతీ ణఅంఝువ అధ్యయనం పేర్కొంది. ఈ క్రమంలో రోజుకు ఒక డ్రింకు తాగినా నోరు, గొంతు క్యాన్సర్ల ముప్పు 13 శాతం, అన్నవాహిక క్యాన్సర్ ముప్పు 26 శాతం మేరుకు పెరుగుతుందని ఒక విశ్లేషణలో తేలింది. ఇక రోజుకు ఐదు, అంతకన్నా ఎక్కువ డ్రింకులు తాగితే ఈ క్యాన్సర్ల ముప్పు సుమారు 4 రెట్లు ఎక్కువవుతుందట.

గుండెకు హాని :

ఒకప్పుడు మద్యపానం గుండెకు మేలు చేయొచ్చని పరిశోధకులు అనుకునేవారు. కానీ, ఇటీవల పరిశోధనల ఫలితాలు వెలుగు చూస్తున్న కొద్దీ ఈ అభిప్రాయం మారిపోయింది. మద్యంతో గుండెపోటు, స్ట్రోక్ ముప్పులు పొంచి ఉంటున్నాయనే విషయం బలపడుతూ వచ్చింది. ఈ క్రమంలో రోజుకు మూడు లేదా అంతకన్నా ఎక్కువ డ్రింకులు తాగే వారికి గుండెపోటు, స్ట్రోక్ వచ్చే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అతిగా, దీర్ఘకాలంగా మద్యం తాగితే గుండె కండరం దెబ్బతింటుందని చెబుతున్నారు. బీపీ పెరగటంతో పాటు కొలెస్ట్రాల్ కూడా ఎక్కువవుతుందట. పూడికలు ఏర్పడే ముప్పు పెరుగుతుందట. మద్యంతో గుండె లయ అస్తవ్యస్తం అయ్యే ప్రమాదం ఉందట. రోజుకు రెండు డ్రింకులు, అంతకన్నా తక్కువ తాగినా గుండెపోటు, స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువగానే ఉంటున్నట్టు పలు అధ్యయనాల్లో తేలింది. ఒక మాదిరిగా మద్యం తాగితే గుండెకు మేలు చేసే అవకాశం ఉందని కొన్ని పరిశోధనలు చెబుతున్నప్పటికీ ఇందులో వాస్తవం లేదని మరికొన్ని అధ్యయనాలు కొట్టిపారేస్తున్నాయి. మద్యం సేవించడం వల్ల కాలేయ వ్యాధులు, గుండె జబ్బులు, వివిధ రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని అధ్యయనం పేర్కొంది. అలాగే, మానసిక ఆరోగ్యం, నిరాశ, ఆందోళన, మద్యపాన రుగ్మతలు వంటి ప్రవర్తనా పరిస్థితులు కూడా వస్తాయని తెలిపింది.

పేగులకు పెను ప్రమాదం :

నోరు, గొంతు మాదిరిగానే జీర్ణాశయం, పేగులు కూడా నేరుగా మద్యం ప్రభావానికి గురవుతాయని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల దెబ్బతినే అవకాశమూ ఎక్కువగా ఉంటుందట. ఇది జీర్ణకోశం లోపం గోడ వాపు, అల్సర్లు, వాంతి, వికారం వంటి సమస్యలకు దారితీస్తుంది. పేగుల్లోని సూక్ష్మక్రిములను దెబ్బ తీయటం వల్ల విరేచనాలు, పోషకాలను సరిగా గ్రహించకోలేకపోవటం వంటి సమస్యలు రావొచ్చట. పేగులో నుంచి హాని కారకాలు రక్తంలోకి వెళ్లకుండా చూసే పొర దెబ్బతినొచ్చు. తద్వారా రక్తంలోకి విషతుల్యాలు చేరుకొని, శరీరమంతా వాపు ప్రక్రియ ప్రేరేపితం కావొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో రోజుకు రెండు, అంతకన్నా ఎక్కువ డ్రింకులు తాగే వారికి పెద్దపేగు క్యాన్సర్ వచ్చే అవకాశం 25 శాతం వరకూ ఎక్కువగా ఉంటున్నట్లు ఒక తాజా అధ్యయనంలో తేలింది.

కాలేయం కకావికలం :

మద్యం మూలంగా దెబ్బతినే అవయవాల్లో ప్రధానంగా లివర్ ఒకటి. మద్యంతో ముడిపడిన లివర్ వ్యాధులు ఎంతో మందిని కబళిస్తోంది. రక్తంలో కలిసిన మద్యాన్ని వడగట్టేది కాలేయమే అని నిపుణులు చెబుతున్నారు. దీన్ని వడగడుతున్న ప్రతిసారీ కొన్ని కాలేయ కణాలు చనిపోతుంటాయని పేర్కొంటున్నారు. వాస్తవానికి, కాలేయం కొత్త కణాలను సృష్టించుకుంటుందట. కానీ, అదే పనిగా మద్యం ఎక్కువగా తాగుతుంటే క్రమంలో ఈ సామర్థ్యం తగ్గుతూ వస్తుంది. మద్యం అలవాటు గల వారికి కాలేయ కణాల్లో కొవ్వు పోగుపడటం, హెపటైటిస్ (కాలేయం వాపు), సిరోసిస్ (కాలేయం గట్టిపడటం) ముప్పు ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో రోజుకు నాలుగు డ్రింకుల కన్నా ఎక్కువ తాగేవారిలో 90 శాతం మందికి కాలేయంలో కొవ్వు పోగుపడుతోందని నిపుణుల అంచనా. అయితే, రోజుకు మూడు, అంతకన్నా ఎక్కువ డ్రింకులు తాగేవారిలో 30 శాతం మంది హెపటైటిస్ బారినపడుతున్నారు. అయితే, ఇప్పుడే జాగ్రత్త పడితే తొలిదశలో ఇలాంటి సమస్యలను వెనక్కి మళ్లించుకోవచ్చుట. కాలేయం గట్టిపడటం తీవ్రమైతే మాత్రం కోలుకోవటం కష్టం. అయితే, అతిగా మద్యం తాగితే కాలేయ క్యాన్సర్ల ముప్పూ ఎక్కువవుతుందట.

ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం.



# విడుదలకు ముందే దురంధర్ కలెక్షన్లు






## ప్రీరిలీజ్ కోసం 130 కోట్లు రాబట్టినట్లు ప్రచారం

బాక్సాఫీస్ వద్ద మరోసారి కలెక్షన్ల వర్షం సృష్టించేందుకు 'ధురంధర్ 2' సిద్ధమవుతోంది. రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు ఆదిత్యధర్ తెరకెక్కించిన మోస్ట్ అవేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ అడ్వాన్స్ బుకింగ్స్‌లో రికార్డులు కొల్లగొడుతోంది. 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్రం, కేవలం అడ్వాన్స్ సేల్స్ ద్వారానే వంద కోట్ల క్లబ్‌లో చేరి అందరినీ ఆశ్చర్యపరిచింది. పెయిడ్ ప్రివ్యూల్లోనే కోట్లు వసూలుచేస్తోంది. ఈ కలెక్షన్లు చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్ 2' ప్రభంజనం ఏ స్థాయిలో ఉండనుందో తెలుస్తోంది. భారీ అంచనాల మధ్య ఉగాదికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఒకరోజు ముందుగానే పెయిడ్ ప్రివ్యూలు ఉండనున్నాయి. దీంతో దీని టికెట్స్ హాట్‌కేకుల్లా అమ్ముడైనట్లు తెలుస్తోంది. ప్రివ్యూల ద్వారా రూ.40.54 కోట్లు, మొదటిరోజు అడ్వాన్స్ బుకింగ్స్‌లో రూ.29 కోట్లు వచ్చాయని సినీ వర్గాలు వెల్లడించాయి. వీటితో పాటు ఓవర్సీస్‌లో సుమారు రూ.60 కోట్లకు పైగా కలెక్షన్లు వచ్చాయని సమాచారం. దీంతో మొత్తంగా ఈ సినిమా విడుదలకు రెండు రోజుల ముందే రూ.130 కోట్లు తన ఖాతాలో వేసుకున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా 15,000 థియేటర్‌లలో ఈ సినిమాను ప్రదర్శించ నున్నారు.

# చిరంజీవితో తప్పకుండా ఓ సినిమా చేస్తా

## ఉస్తాద్ ప్రమోషన్‌లో హరీష్ శంకర్



ఈ ఉగాదికి 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పవన్ కల్యాణ్ అభిమానుల్లో జోష్ నింపనున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. పవన్ హీరోగా ఆయన తెరకెక్కించిన ఈ సినిమా 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు హరీశ్. తాజాగా ఆయన చిరంజీవి గురించి మట్లాడారు. ఈ ట్రైలర్ చూసి చిరంజీవి నాతో 20 నిమిషాలు మాట్లాడారు. డైలాగులు బాగున్నాయన్నారు. పవన్ చాలా అందంగా ఉన్నారని ఆనందంగా చెప్పారు. ఆ ఫోన్ పెట్టేశాక నాకు ఓ విషయం అర్థమైంది. చిరంజీవికి పవన్ కల్యాణ్ తమ్ముడు మాత్రమే కాదు.. కొడుకు కూడా అనిపించింది. ప్రతి షాట్ గురించి చెబుతూ ఆయన మురిసిపోయారు. నేను చిరంజీవిని చాలాసార్లు కలిశాను. ఆయనతో కొన్ని యాడ్ ఫిల్మ్‌లు తీశాను. ఆయనతో నా సినిమా ప్రాసెస్‌లో ఉంది. కచ్చితంగా మెగాస్టార్‌తో ఒక 'రౌడీ అల్లుడు', 'దొంగ మొగుడు', 'గ్యాంగ్ లీడర్' లాంటి సినిమా చేసి తీరతాను' అని హరీశ్ చెప్పారు. పవన్‌కల్యాణ్ గొప్ప వ్యక్తి. 16 ఏళ్ల కుర్రాడిగా ఉన్నప్పటినుంచే సమాజం గురించి ఆలోచించేవారు.




# వివాదంలో సర్కే చునర్ తేరీ సాంగ్

కన్నడ నటుడు ధ్రువ సర్జా కథానాయకుడిగా ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'ఐఆ: ది డెవిల్' భారీ వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలోని 'సర్కే చునర్ తేరి సర్కే' అనే స్పెషల్ సాంగ్ అశ్లీలంగా ఉందంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పాటపై నిషేధం విధించాలని కోరుతూ ముంబైకి చెందిన ప్రముఖ న్యాయవాది వినీత్ జిందాల్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌తో పాటు సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేశాడు. ఈ పాటలోని సాహిత్యం మరియు దృశ్యాలు అత్యంత అశ్లీలంగా, అసభ్యకరంగా ఉన్నాయని, ముఖ్యంగా మైనర్లకు హాని కలిగించే విధంగా ఉన్నాయని జిందాల్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. యూట్యూబ్ మరియు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో విచ్చలవిడిగా ప్రచారంలో ఉన్న ఈ పాట, పబ్లిక్ డెన్సీని దెబ్బతీసేలా ఉందని ఆరోపించారు. ఈ పాటలో ఉపయోగించిన పదజాలం మరియు నృత్య రీతులు రెచ్చగొట్టేలా ఉన్నాయని, ఇది సమాజంలో అసభ్యతను ప్రోత్సహిస్తుందని జిందాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాటకు సాహిత్యం రాసిన రాకీబ్ ఆలం, దర్శకుడు ప్రేమ్, సంగీత దర్శకుడు అర్జున్ జన్య మరియు గాయని మంగ్లీ వంటి వారిని కూడా ఈ ఫిర్యాదులో ప్రస్తావించాడు. ఇప్పటికే ఈ అంశంపై ఢిల్లీ పోలీస్ సైబర్ సెల్‌లో కూడా విడిగా క్రిమినల్ ఫిర్యాదు నమోదైందని, పిల్లల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి ఈ పాటను వెంటనే తొలగించాలని ఆయన అధికారులను డిమాండ్

## శరవేగంగా సాగుతున్న షూటింగ్

ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రెబల్ స్టార్ ప్రభాస్ .. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించేందుకు సిద్ధమవుతున్నాడు. అందులో హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హిస్టారికల్ వార్ డ్రామా 'ఫౌజీ' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను ఈ ఏడాది దసరాకు రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. అయితే, అనుకున్న సమయానికి షూటింగ్ ఫినిష్ అవడం కష్టమని, ఫలితంగా పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఏది ఏమైనా సరే ఈ చిత్రాన్నివిజయదశమి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ గట్టిగా ఫిక్స్ అయ్యారట. దసరా సీజన్ టాలీవుడ్‌లో అతిపెద్ద సినిమాలకు కలిసొచ్చే సమయం కావడంతో, ఆ లోపే పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు హను రాఘవపూడి విజన్‌పై పూర్తి నమ్మకంతో ఉన్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ, ఆయనకు పూర్తిగా 'ఫ్రీ హ్యాండ్' ఇచ్చినట్లు తెలుస్తోంది. టెక్నికల్ వాల్యూస్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, అనుకున్న సమయానికి అవుట్‌పుట్ తీసుకురావడమే లక్ష్యంగా టీమ్ పనిచేస్తోంది. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే.. ఈ ఏడాది జూలై లేదా ఆగస్టు లోపు షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంతో ఇమాన్వీ హీరోయిన్‌గా టాలీవుడ్‌కి పరిచయం అవుతోంది. మొత్తంగా.. ఈ సినిమాతో ప్రభాస్ మరోసారి పాన్ ఇండియా లెవల్లో సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.



# వసంత కిరణం - ఉగాది స్వర్ణం




**మార్చి 18 (ఆకాంక్ష) :**వేకువ జామున విరిసిన పూల పరిమళం! ప్రకృతి వీణపై పలికిన వసంత రాగం!! ఆమె నడకలో మెరిసే పట్టు అంచుల కాంతి! మనసు గడపలో వెలిగే నూతన శాంతి!! చిగురుటాకుల చాటున దాగున్న చిరునవ్వు! వేపపూత చేదులో దాగున్న తీపి అనుభూతి నువ్వు!! ముంగిట ముగ్గుల రంగుల హరివిల్లులు! మామిడి తోరణాల మధ్య మొలకెత్తే కొత్త ఆశలు!! ప్రకృతి ఒడిలో పుట్టిన ఆ పసిడి రూపం! తెలుగు సంస్కృతికి నిలువెత్తు ప్రతిరూపం!! అడుగు అడుగునా ఆశల పల్లకీ మోస్తూ! కాల చక్రపు వేగాన్ని చిరునవ్వుతో ఆహ్వానిస్తూ!! మట్టి వాసనలో ప్రతిధ్వనించే జీవన గీతం! తెలుగు లోగిళ్లలో వికసించిన ఉగాది చైతన్యం!! డా.పూసపాటి వేదాద్రి 9912197694

# ఉగాది వసంత విభావరి”



**మార్చి 18 (ఆకాంక్ష) :**వసంత విభావరిలో విరిసిన వెలుగుల వేళ, పచ్చని ప్రకృతి పులకించి నవ్విన వేళ, గడపల గర్భగృహమున మంగళ స్వరమై తెలుగు తల్లి పండుగగా ఉగాది అవతరించె. మామిడి తొరణాల పచ్చని తంతువులలో ఆశల అలలు అలరిస్తూ ఊగుచుండగా, వేప పుష్పాల చేదు గర్భిత గంధములో జీవన సత్యాల గూఢార్థం మౌనమై నిలిచె. కోకిల కూయు కంఠమున కలకల రాగములు ప్రకృతి మంగళ ధ్వనులై పరిమళించగా, వసంత సమీర మృదుస్పర్శ సన్నిధిలో నూతన సంవత్సర స్వప్నాలు సుస్వాగతించె. మామిడివేపల మేళన రసమూర్తిగా ఉగాది పచ్చడి రూపమై వెలిసిన వేళ, చేదుతీపిపులుపుకారంఉప్పుల రుచులలో జీవిత చక్రం సత్యమై ప్రతిధ్వనించె. సంస్కృతి సుమములు వికసించు వేళ, సంప్రదాయ దీపములు ప్రకాశించు వేళ, ప్రకృతిమనుజ బంధమది పావనమై భూమి ఒడిలో నిత్యమై నిలిచియుండె. అందుకే ప్రతి ఉగాది ప్రబోధమై, పచ్చని మామిడి పుటల పలుకులలో, వేప పుష్ప సుగంధ విరిసిన వేళ, కోకిల గానామృత తరంగములలో, ప్రకృతి సాక్షిగా మన జీవన గాథకు కొత్త ఆది కొత్త ఆశ కొత్త మార్గమై నిలిచె. ప్రకృతితో కలిసి జీవిస్తూ, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ, కొత్త ఆశలతో ముందుకు సాగాలి అని కోరుకుంటూ మీకు మీ కుటుంబ సభ్యులకు పకృతి మెచ్చిన ఉగాది పండుగ శుభాకాంక్షలు. రచన: మంజుల పత్తిపాటి మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డెఒరెక్టర్ యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ రాష్ట్రం చరవాణి 9347042218.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత...



కొమరవెల్లి//**మార్చి 18 (ఆకాంక్ష) :** మండలంలోని రసూలాబాద్ గ్రామానికి చెందిన జనగాం రజిని, ఎర్రోళ్ల లక్ష్మికి మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ కాపీలను అధికారుల సమక్షంలో అందజేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు చేయడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి రెండు ఇళ్లను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్‌లకు గ్రామ ఇంద్రమ్మ కమిటీ సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని, భవిష్యత్తులో మరిన్ని అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బాలల హక్కులపై అవగాహన సదస్సు...



నాగర్‌కర్నూల్//**మార్చి 18 (ఆకాంక్ష) :** రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా సంస్థ నాగర్‌కర్నూల్ చైర్మన్, సెక్రటరీల సూచనలతో “చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్” పథకం పై అవగాహన కల్పించేందుకు లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ చిల్డ్రన్ నాగర్‌కర్నూల్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రిసం హై స్కూల్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీ శ్రీరామ్ ఆర్య హాజరై మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణ అత్యంత కీలకమని, ప్రతి బాలబాలిక తప్పనిసరిగా పాఠశాలకు హాజరై చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, అనవసర మెసేజ్‌లు, వీడియోలను ఇతరులకు ఫార్వర్డ్ చేయడం లేదా వాటికి ప్రతిస్పందించడం చేయరాదని హెచ్చరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ ఉన్నత స్థానాలను చేరుకోవాలని సూచించారు. ముఖ్యంగా మైనర్ బాలికలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టేందుకు పాక్సో చట్టం కఠినంగా అమలులో ఉందని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా షీ టీమ్ లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. అలాగే ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించి సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## జీడీకే 11వ ఇంక్లైన్‌లో ఖాళీ పోస్టుల

# భర్తీకి ఏఐటీయూసీ వినతిపత్రం...



గోదావరిఖని//**మార్చి 18 (ఆకాంక్ష) :** సింగరేణి ఆర్జీవన్ ఏరియాలోని జీడీకే 11వ ఇంక్లైన్ గనిలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ నాయకులు గని మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. బుధవారం ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ నాయిని శంకర్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆర్జీవన్ యాజమాన్యం గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో జరిగిన ఏరియా లెవల్ స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఏరియాలో ఖాళీగా ఉన్న టైమ్ రేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సమయంలో యాజమాన్యం కూడా దీనికి అంగీకరించి ఖాళీల భర్తీకి ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ప్రస్తుతం జీడీకే 11వ ఇంక్లైన్ గనిలో కేవలం కొంతమంది పోస్టులకు మాత్రమే నోటీసు ఇవ్వడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం కోల్ కట్టర్, సపోర్ట్ మెన్, లైన్ మెన్ పోస్టుల భర్తీకి మాత్రమే నోటీసు బోర్డులో ప్రకటన ఇచ్చారని, మిగతా ఖాళీగా ఉన్న టైమ్ రేటెడ్ పోస్టులను ప్రకటనలో ప్రస్తావించలేదని వారు తెలిపారు. దీంతో గనిలో పనిభారం పెరిగి, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి మిగతా ఖాళీ పోస్టులను కూడా వెంటనే గుర్తించి, నోటీసు బోర్డు ద్వారా ప్రకటించి భర్తీ చేయాలని గని మేనేజర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గని మేనేజర్ స్పందిస్తూ, మిగిలిన ఖాళీలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎం. చక్రపాణి, కుక్కల శ్రీనివాస్, గడ్డం బాలకృష్ణ, పొన్నం రంజిత్, శశాంక్, అడివి మల్లయ్య, అంగిడి రమేశ్, ఎం. కిరణ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాన్ని వెంటనే ఆపాలి...

## వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం...

## మహ్మద్ పాషామియా అధ్యక్షతన జరిగిన కార్యక్రమం....

## అమెరికా కుట్రలో బాగమే ఆఫ్ఘాన్ పై పాకిస్తాన్ దాడులు...



హైదరాబాద్ /**మార్చి 18 (ఆకాంక్ష) :** ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ గత 19 రోజులుగా సాగిస్తున్న సామ్రాజ్యవాద విస్తరణ ఆదిపత్య దురాక్రమణ దాడులతో కూడిన యుద్ధాన్ని మరియు అమెరికా కుట్రలో బాగంగా ఆఫ్ఘాన్ పై పాకిస్థాన్ జరిపిన దాడులను జవహర్ నగర్ జీహెచ్ఎంసి పరిధిలో గల వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన నేతలు తీవ్రంగా ఖండించారు. జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో పశ్చిమాసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధం పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. 2026, మార్చ్-18, చెన్నాపూర్, దేవేందర్ నగర్ లో ఆ సంస్థ అధ్యక్షుడు మహ్మద్ పాషామియా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇరాన్, వెనుజులా దేశాలపై అమెరికా అమెరికా కుంటిసాకులు చూపి, ఇజ్రాయెల్ తో కలిసి దురాక్రమణ దాడులకు పాల్పడడాన్ని సిపిఎం శివన్నారాయణ తీవ్రంగా ఎండగట్టారు. ప్రపంచంలోనే బెస్ట్ నెంబర్ వన్ ఫ్రెండ్ అమెరికా ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ అని చెప్పుకొన్న భారత ప్రధాని నరేంద్రమోదీ, యుద్ధ నివారణకు చొరవ చూపాలని ఇఫ్టూ జాతీయ కన్వీనర్ షేక్ షావలి డిమాండ్ చేశారు. భారత్, పాకిస్థాన్ యుద్ధాన్ని తాను చెప్పితేనే ఆగిందని అంటున్న ట్రంప్ కు,ప్రధాని నరేంద్రమోదీ కూడ ఇరాన్ పై ట్రంప్, నేతన్యాహు సాగిస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేయకపోవడాన్ని ఐ.ఎఫ్.టి.యు. శివబాబు తప్పుపట్టారు. అమెరికా పెత్తందారీ తనానికి భారత ప్రభుత్వం లొంగి పోయిందని, బాంచేన్ దొరా నీ కాళ్ళు మొక్కుతా అనే స్థితికి ట్రంప్ కు పాదాక్రాంతం అయ్యారని మోదీపై ముస్లిం కమిటీ మహ్మద్ పాషామియా మండిపడ్డారు. ఆయా దేశాల్లో అంతర్యుద్ధాలను సృష్టించడం, ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు నిర్వహించి, ప్రజాస్వామ్య ప్రభుత్వాలను కూలదోయడం, తనకు అనుకూలమైన ప్రభుత్వ పాలకులకు పగ్గాలు అప్పగించడం, తద్వారా ఆ దేశాల వనరులను, కారుచౌకగా మానవ శ్రమను కొల్లగొట్టడం యుద్ధోన్మాది అమెరికా నైజాం అని,అమెరికా దాని నాటో కూటమి దేశాలు, ఐక్యరాజ్య సమితి దశాబ్దాల తరబడి విధించిన ఆంక్షలతో ఇరాన్ ప్రజలు సరైన ఆహారం, విద్య, వైద్యం, ఉపాధి లేక తల్లడిల్లుతున్నారని పిడిఎం చంద్రమౌళి తెలియజేస్తూ, ఆదివాసి, దళితులు, ఇతర మైనారిటీ వర్గాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార్ శక్తుల చర్యలను ఎండగట్టారు. ఆఫ్ఘాన్, లిబియా, ఇరాక్, లెబనిన్, సోమాలియా, సిరియా, వెనుజులాను అస్థిర పరిచిన అమెరికా సామ్రాజ్యావాది, నేడు ఇరాన్ ను లొంగ దీసుకోవడానికి ఇజ్రాయెల్ తో అన్నిరకాల బారీ విద్వాంస, సైనిక దాడులలో వేలాదిమంది చిన్నపిల్లలను, మహిళలను పొట్టన పెట్టుకుంటున్నదని ముస్లిం కమిటీ టి.కాలేషా ఆవేదన చెందారు. తమ మాట వినని దేశాల రాజకీయ, ఆర్థిక స్వేచ్ఛ, స్వాతంత్రాలను కాలరాచేలా, అంతర్జాతీయ న్యాయ సూత్రాలను సహితం కాలరాచి, ఐఎంఎఫ్, ప్రపంచబాంకు లాంటి ఆర్థిక సంస్థలచే అప్పులకు బలిచేయడం, ఆతర్వాత తమ పెద్దన్న పోలీసు పాత్రను గుర్తించని దేశాలను శక్తివంతమైన సైనిక చర్యలకు గురిచేయడాన్ని ఎమ్మార్పీఎస్ వడ్డెపల్లి శివ తీవ్రంగా ఆక్షేపించారు. తన ఆధిపత్యానికి సవాలుగా నిలిచిన రష్యా, చైనాను నిలువరించడానికి సుంకాల పేరుతో కట్టడి చేయడం దుర్మార్గం అని, ప్రపంచ మార్కెట్ ను తన గుప్పిట బందించటానికి ఎదురౌతున్న సవాళ్ళకు మూడవ ప్రపంచ దేశాలను యుద్ధం పేరుతో భయపెట్టి, ఆయుధాల వ్యాపారాన్ని కొనసాగించే లక్ష్యంలో బాగంగా ఒప్పందాల పేరిట ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని కాలరాస్తున్న అమెరికా చర్యలను పిఓడబ్ల్యూ (విముక్తి) పెర్క సునీత ఎత్తిచూపారు. అమెరికా జర్నలిస్టులపై రాడికల్ ఫెలోస్, ఇరాన్ సపోర్టెడ్ గూన్స్ అని ట్రంప్ చేస్తున్న బెదిరింపు ప్రకటనలను కవి, రచయిత, ప్రజాకళాకారుడు ఎస్.కె.మీరా తీవ్రంగా ఖండిస్తూ, ఇప్పటికైన ప్రపంచ పౌర సమాజం ప్రపంచ పెట్టుబడిదారి అంతర్గత విస్తరణను తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. సమానత్వం, స్వయం ప్రతిపత్తి విలువల కొరకు పోరాడుతున్న ఇరాన్ లాంటి దేశాలకు మద్దతుగా నిలబడుదామని తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక తుమ్మరాణి పిలుపునిచ్చారు. వీటో అధికారం కలిగిన దేశాలలో భారత్ ఇరాన్ దాడులపై మాత్రమే స్పందించడం విదేశాంగ అలీన విధాన స్ఫూర్తికి విరుద్ధం అని, ఇలాంటి ద్వంద, లొంగుబాటు విధానాలను అనుసరిస్తున్న పాలకుల తీరును ఎండగట్టి, అంతర్జాతీయ సమాజం మొత్తం మానవత్వాన్ని ఎత్తిపట్టాలని ముస్లిం కమిటీ సైయద్ కోరారు. యుద్ధం వలన ప్రపంచ మానవ మనుగడ ప్రమాదంలోకి నెట్టివేయబడి, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఆత్మహత్యలు, అప్పులకు గురౌతున్నారని సైయద్ ముబషీర్ అబ్బు గుర్తుచేశారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత పెరిగే డీజిల్ పెట్రోల్ ధరలు వలన బంగ్లాదేశ్, శ్రీలంక, నేపల్ లాంటి దేశాలలో తలెత్తిన పరిస్తితులు, భారత్ లో కూడా సంభవించవచ్చు అనే ఆందోళన ప్రజలలో నెలకొందని, ఒకవేల అలాంటి పరిస్థితే ఉత్పన్నమయితే దానికి నైతిక బాధ్యత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే వహించాల్సి ఉంటుందని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన పలువురు నేతలు ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ నరేంద్రమోదీ బీజేపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈపై కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జవహర్ నగర్ చైర్మన్ కొలిపాక సాయికిరణ్, బీఆర్ఎస్ మైనారిటీ సెల్ మహ్మద్ మథీన్, ఇస్మాయిల్, ఇమ్రాన్, మహ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలంటూ ఎమ్మార్వోకు బీజేపీ వినతిపత్రం...

## రెండు సంవత్సరాలు గడిచినా హామీలు నెరవేర్చలేదని కాంగ్రెస్‌పై విమర్శలు...

## రైతు భరోసా, పెన్షన్లు, గృహాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్...



గోదావరిఖని//**మార్చి 18 (ఆకాంక్ష) :** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ మండల అధ్యక్షులు ఊరగొండ అపర్ణ, గుండెబోయిన భూమయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి పాల్గొని ఎమ్మార్వోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అయితే రెండు సంవత్సరాలు గడిచినా వాటిలో చాలా వరకు అమలు కాలేదని విమర్శించారు. ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి పథకం, పేదలకు గృహ నిర్మాణం, రైతులకు రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మండలంలోని రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా సమయానికి అందకపోవడంతో అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆసరా పెన్షన్లు అందడం లేదని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. పేదలకు గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల మంజూరు ప్రక్రియ ఆలస్యం అవుతుందని, భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన దరఖాస్తులు ఇంకా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని తక్షణమే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. అదనంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు, వీధి దీపాల సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వోను వినతిపత్రం ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ముసుకుల భాస్కర్ రెడ్డి, సుల్వ లక్ష్మీనరసయ్య, కోడూరి రమేష్, మాదరబోయిన రాకేష్, రామగిరి నరేష్, పాకాల నరసింహారెడ్డి, ఎల్తూరి సరిత, ఎల్తూరి రాజయ్య, అంకరి భరత్, ఆకునూరి రమేష్, కొమురవెల్లి విశ్వనాథ్, ఇరుగు రాళ శివ, ఆలకుంట మహేష్, గోగుల రమేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.



# ఉపసర్పంచ్ చొరవ...రాత్రికి రాత్రే చెట్లు తొలగింపు...



నాగర్ కర్నూల్ టౌన్///**మార్చి 18 (ఆకాంక్ష) :** మంగళవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పాలెంబిజినేపల్లి మధ్య ఆర్ & బి రోడ్డుకు ఇరువైపులా చెట్లు విరిగిపడి వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న పాలెం గ్రామ ఉపసర్పంచ్ గోవిందు శ్రీనివాసులు వెంటనే స్పందించి, రాత్రికిరాత్రే చెట్లను తొలగింపజేసి మార్గాన్ని క్లియర్ చేశారు. దీంతో వాహనదారులు, గ్రామస్తులు ఆయనను అభినందించారు.

# హోటళ్లపై సివిల్ సప్లయ అధికారుల దాడులు...

## గృహ గ్యాస్ దుర్వినియోగంపై కేసులు...



గోదావరిఖని//**మార్చి 18 (ఆకాంక్ష) :** గోదావరిఖని ప్రాంతంలో సివిల్ సప్లయ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పలు హోటళ్లలో నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారు. గృహ వినియోగానికి ఉద్దేశించిన ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు తేలడంతో అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మొత్తం ఐదు గృహ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని, నిబంధనలు ఉల్లంఘించిన ఐదు హోటళ్లపై కేసులు నమోదు చేశారు. వాణిజ్య అవసరాల కోసం ప్రత్యేకంగా ఉన్న కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వినియోగించాలని, గృహ సిలిండర్లను దుర్వినియోగం చేయడం చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన అధికారులు, భవిష్యత్తులో కూడా తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. వినియోగదారులు, వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ వ్యవహరించాలని సూచించారు.

# వెంకన్న దేవాలయంలో ఉగాది పంచాంగ శ్రవణం...




నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 18 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెం గ్రామంలోని శ్రీ అలెర్మెల్ మంగ సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం (మార్చి 19) సాయంత్రం 4:30 గంటలకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొరవి రామానుజాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రాశుల ఫలితాలు, వర్షాలు, పంటలు, ప్రకృతి పరిస్థితులు, జన్మ నక్షత్రాలు, ఆదాయ వ్యయాల వివరాలు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 8464990776ను సంప్రదించవచ్చు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన

# ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి...



నాగర్ కర్నూల్/**మార్చి 18 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ మండలం వనపట్ల గ్రామానికి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మరణ వార్త తెలిసిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి స్పందించారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న ఆయన, మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే, శ్రీనివాస్ రెడ్డి సేవలను స్మరించుకున్నారు. గ్రామ అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. కుటుంబానికి ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో తాము కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున అందాల్సిన అన్ని సహాయాలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# అరక్షిత బాలికలకు ఉగాది కానుకలు...



నాగర్ కర్నూల్//**మార్చి 18 (ఆకాంక్ష) :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద ఉన్న శ్రీ జ్ఞానేశ్వర్ వాత్సల్య అరక్షిత బాలికల ఆశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమంలో నివసిస్తున్న 20 మంది అరక్షిత బాలికలకు ఆకారపు కుమారస్వామి కుటుంబ సభ్యులు నూతన వస్త్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కే. రాజేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొని బాలికలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరక్షిత బాలికలను రక్షించడం, వారికి అవసరమైన సహాయం చేయడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షులు ఆకారపు విశ్వనాథం, కమిటీ సభ్యులు ఆకారపు శంకరయ్య, ఏ. నరసింహస్వామి, ఏ. రవికుమార్, ఏ. బద్రీనాథ్, నరహరి బాలస్వామి, సిబ్బంది వేణుగోపాల్, మహిళా వార్డెన్ కల్పనతో పాటు ఆశ్రమ బాలికలు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లాలో బస్టాండ్‌లో ఈవ్‌టీజింగ్...

### ముగ్గురు పోకిరీలు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత...



నాగర్ కర్నూల్//**మార్చి 18 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లాలోని బస్టాండ్ పరిసరాల్లో అమ్మాయిలను వేధిస్తూ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు పోకిరీలను జిల్లా షీ టీమ్ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఇటీవల బస్టాండ్ ప్రాంతంలో యువతులపై వేధింపులు పెరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు షీ టీమ్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.ఈ క్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతూ అమ్మాయిలను వేధిస్తున్న ముగ్గురు యువకులను గుర్తించి, వెంటనే అదుపులోకి తీసుకున్నారు. వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ షీ టీమ్ ఎస్ఐ రజిత మాట్లాడుతూ మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవ్‌టీజింగ్, వేధింపులు ఎదురైనప్పుడు బాధితులు భయపడకుండా వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్ పోలీస్ నంబర్ 8712657676 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ చర్యల్లో షీ టీమ్ ఎస్ఐ రజితతో పాటు ఏఎస్ఐ రాజ్యలక్ష్మి, కానిస్టేబుల్ వెంకటేష్ పాల్గొన్నారు.

## నాగర్ కర్నూలులో ఉగాది పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు...



నాగర్ కర్నూల్/**మార్చి 18 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రామ్ నగర్ కాలనీలో గల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 19వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం జరగనుందని రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు.ఈ సందర్భంగా పంచాంగ శ్రవణంలో వివిధ రాశుల ఫలితాలు, వర్షాల పరిస్థితులు, పంటల పరిస్థితి, ప్రకృతి మార్పులు, జన్మ నక్షత్రాలు మరియు జన్మరాశుల వారికి సంబంధించిన ఆదాయ-వ్యయాలు వంటి అంశాలను విశదీకరించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ పంచాంగ శ్రవణాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమం అనంతరం రామాలయ అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9440981253 నంబరుకు సంప్రదించవచ్చని సూచించారు.

## కార్మికులపై కక్షసాధింపు చర్యలు ఆపాలి...

### లేబర్ కమిషనర్‌కు దళిత బహుజన లేబర్ అసోసియేషన్ ఫిర్యాదు...



పెద్దపల్లి//**మార్చి 18 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా కార్మిక అధికారిణి హేమలత వ్యవహార శైలిపై భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు న్యాయం చేయాల్సిన అధికారిణే వారిని వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం హైదరాబాద్‌లోని టంగుటూరి అంజయ్య కార్మిక సంక్షేమ భవనంలో తెలంగాణ రాష్ట్ర లేబర్ కమిషనర్ పమేలా సత్పతికి దళిత బహుజన లేబర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి కైలాసం మాట్లాడుతూ, పెద్దపల్లి కార్మిక అధికారి హేమలత ప్రభుత్వం నుంచి కార్మికులకు అందాల్సిన ఆర్థిక సహాయాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన బెనిఫిట్ బిల్లులను వరుసగా తిరస్కరిస్తూ, అనవసరమైన అభ్యంతరాలు వ్యక్తం చేసి కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు.ఈ విషయంపై గతంలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, మందలింపులు జరిగినా సంబంధిత అధికారిణి తీరులో ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు. అంతేకాకుండా, గతంలో పెద్దపల్లి జిల్లా మంథని ప్రాంతంలో విధులు నిర్వహించిన సమయంలో కూడా కార్మికుల తరఫున మాట్లాడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద సహా పలు తప్పుడు కేసులు నమోదు చేయించారని ఆరోపించారు.దీంతో ప్రస్తుతం కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయని, తమ హక్కులు కోల్పోతున్నామనే ఆందోళన వ్యక్తమవుతోందని కైలాసం పేర్కొన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న అధికారిణిపై తక్షణ చర్యలు తీసుకోవాలని, ఆమెను బదిలీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ప్రయోజనాలను వెంటనే కార్మికులకు అందేలా చూడాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో జాతీయ మానవత వెలుగు అవార్డు గ్రహీత దార మధు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా రైతులకు నీరు విడుదల చేయాలి...

### సింగూరు నుంచి 0.3 టీఎంసీలు విడుదల చేయాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి డిమాండ్...




మెదక్//**మార్చి 18 (ఆకాంక్ష) :** మెదక్ జిల్లా రైతుల పంటలను కాపాడేందుకు సింగూరు ప్రాజెక్టు నుంచి తక్షణమే 0.3 టీఎంసీల సాగునీటిని విడుదల చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం అసెంబ్లీలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె ఈ విషయాన్ని ప్రస్తావించారు.జిల్లాలో పంటలు కోత దశకు చేరుకున్న ఈ సమయంలో నీటి కొరత తీవ్రంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, రైతులు భారీ నష్టాలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుతం పరిస్థితిని గమనించి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రెండు రోజుల్లోగా సింగూరు ప్రాజెక్టు నుంచి 0.3 టీఎంసీల నీటిని విడుదల చేస్తే పంటలు రక్షించబడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ం

# సంప్రదాయాలకు శ్రీకారం...

### మట్టి పాత్రలతో ఉగాది సందేశం ఇచ్చిన ఎమ్మెల్యే మక్కన్ సింగ్...



గోదావరిఖని//**మార్చి 18 (ఆకాంక్ష) :** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ ప్రత్యేకంగా సంప్రదాయాలకు శ్రీకారం చుట్టారు. శాసనసభ ఆవరణంలో ప్రముఖులకు మట్టి పాత్రలను అందజేస్తూ "మట్టి పాత్రలు వాడండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి, కుల వృత్తులను ప్రోత్సహించండి" అనే సందేశాన్ని ప్రజలకు చేరవేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కలకు ఉగాది కానుకలుగా మట్టి పాత్రల కిట్లను అందించారు. ఈ కిట్లలో ఉగాది పండుగకు అవసరమైన మట్టి కుండలు, గ్లాసులు, జగ్గులు, బౌళ్లు, అలాగే ఉగాది శద్రుచులకు అవసరమైన మామిడి కాయలు, వేప పువ్వు, బెల్లం, చింతపండు, కారం వంటి పదార్థాలను చేర్చారు.ఈ సందర్భంగా నాయకులు రాష్ట్ర ప్రజలకు పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ రక్షణలో భాగంగా మట్టి పాత్రల వినియోగం పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. మట్టి పాత్రలు ఆరోగ్యానికి హానికరం కాదని, వాటి వినియోగం ద్వారా సంప్రదాయాలను కాపాడటమే కాకుండా కుల వృత్తులను ప్రోత్సహించవచ్చని వివరించారు.మన సంస్కృతి, సంప్రదాయాలకు పండగల సందర్భంలో మట్టి పాత్రలు ఎంతో అనుకూలమని పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని తిరిగి ప్రాచుర్యంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉగాది పండుగను మట్టి పాత్రలతో జరుపుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు గ్రామీణ వృత్తులకు ఆదరణ పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.ఈ ఉగాది సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి పాత్రలను వినియోగిస్తూ సంప్రదాయాలను కాపాడాలని, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని ఎమ్మెల్యే మక్కన్ సింగ్ పిలుపునిచ్చారు.

## యువతకు ఎన్టీపీసీ కంప్యూటర్ శిక్షణ కోర్సులు...

గోదావరిఖని//**మార్చి 18 (ఆకాంక్ష) :** యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కంప్యూటర్ శిక్షణ కోర్సులు ప్రారంభించబడుతున్నాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా సీడీ విభాగం ఆధ్వర్యంలో డీసీఏ, టాలీ & జీఎస్టీ వంటి కోర్సులను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కంప్యూటర్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలనుకునే యువతీ యువకులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం అత్యంత కీలకమైందని, ఈ కోర్సుల ద్వారా అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకునే అవకాశం ఉందని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమాలకు ఆసక్తి గల అభ్యర్థులు తప్పనిసరిగా ముందస్తుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకునే చివరి తేదీ ఈ నెల 30వ తేదీగా నిర్ణయించినట్లు వెల్లడించారు.మరిన్ని వివరాలకు చిలుముల శంకర్ (9794180335), గోపు కార్తిక్ (8106044670)లను సంప్రదించవచ్చని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని నిర్వాహకులు కోరారు.

### మంథని మున్సిపాలిటీలో

## ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు...

### 6వ వార్డు కౌన్సిలర్ పోతరబోయిన శ్రీలత ఆవేదన...



మంథని//**మార్చి 18 (ఆకాంక్ష) :** మంథని మున్సిపాలిటీలో ప్రోటోకాల్ ఉల్లంఘన చోటుచేసుకుందని ఆరోపిస్తూ 6వ వార్డు కౌన్సిలర్ పోతరబోయిన శ్రీలత అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన తనను అధికారిక కార్యక్రమాల నుంచి ఉద్దేశపూర్వకంగా పక్కనపెడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.మార్చి 17న మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బోయినిపేట్, తెనుగువాడ, గొల్లగూడెం, దుబ్బగూడెం ప్రాంతాల్లో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమానికి తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. అయినప్పటికీ విషయం తెలుసుకుని రోజంతా పరిశుద్ధ కార్మికులతో కలిసి పనులను పర్యవేక్షించినట్లు తెలిపారు.కార్యక్రమం అనంతరం విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో తన పేరును చేర్చకుండా ఇతర నాయకుల పేర్లను మాత్రమే పొందుపరచడం ద్వారా తనను అవమానించారని శ్రీలత పేర్కొన్నారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కోరారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో ఆలోచన సామర్థ్య వికాసం...




నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 18 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెం గ్రామంలోని శ్రీ గాయత్రి హై స్కూల్‌లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచన సామర్థ్యాన్ని పెంపొందించాయని ఎంఈఓ రఘునందన్ శర్మ తెలిపారు. సరస్వతి మాత చిత్రపటానికి పూలమాలలు అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.విద్యార్థులు రూపొందించిన శాస్త్రీయ నమూనాలు, వినూత్న ఆవిష్కరణలను పరిశీలించిన ఆయన, భవిష్యత్‌కు ఉపయోగపడే ఆలోచనలను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సర్పంచ్ బోనాసి రామకృష్ణ మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్‌లు విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్రంపై ఆసక్తిని పెంచుతాయని అన్నారు.రిటైర్డ్ ఉపాధ్యాయుడు గాడి సురేందర్ కాలుష్యం, ప్లాస్టిక్ వినియోగం వంటి సమస్యల పరిష్కారానికి విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేయాలని పిలుపు నిచ్చారు. సుమారు 170 ప్రదర్శనలు ఆకట్టుకోగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు ప్రారంభం...



మంథని రూరల్//**మార్చి 18 (ఆకాంక్ష) :** మంథని మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు మండల కేంద్రంలో బుధవారం ప్రారంభమయ్యాయి. మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీలను మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ ఎంపిక పోటీలలో మూడవ తరగతి చదువుతున్న సుమారు 30 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలలో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 28వ తేదీ నుండి పెద్దపెల్లి జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలలో పాల్గొననున్నట్లు ఎంఈఓ దాసరి లక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముసుకుల మహేందర్ రెడ్డి, కౌన్సిలర్ మాచిడి రాజు గౌడ్, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ సురేష్, సోమనపల్లి సర్పంచ్ దామోదర్, వ్యాయామ ఉపాధ్యాయులు కొమ్రోజు శ్రీనివాస్, అవధానుల మాధురి, సిఆర్పి మల్లయ్య పాల్గొన్నారు.

## కేజీబీవీ సిబ్బంది విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి...

### ఆర్జేడీ ఎం. సోమిరెడ్డి హెచ్చరిక...



నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 18 (ఆకాంక్ష) :** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు) విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కీలక కేంద్రాలుగా ఉన్నాయని, ఈ సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర ప్రాంతీయ విద్యా సంచాలకులు హైదరాబాద్ ఆర్జేడీ ఎం. సోమిరెడ్డి స్పష్టం చేశారు. బాధ్యతారాహిత్యాన్ని ఏమాత్రం సహించబోమని, ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో కట్టుదిట్టంగా వ్యవహరించాలని హెచ్చరించారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండల కేంద్రంలోని కేజీబీవీని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల విద్యా ప్రమాణాలు, బోధన విధానం, ఉపాధ్యాయుల పనితీరు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభ్యాస స్థాయి, అవగాహన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాలు, వసతి పరిస్థితులను కూడా పరిశీలించిన ఆర్జేడీ, ఆహారం నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యా అభివృద్ధిపై ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీలలో పనిచేసే ప్రతి ఒక్కరూ తమ వృత్తి పట్ల నిబద్ధతతో వ్యవహరించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కృషి చేయాలని సూచించారు. విద్యాసంస్థలకు చెడ్డపేరు రాకుండా అందరూ సమన్వయంతో పని చేయాలని, వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి సంస్థ ప్రతిష్టను కాపాడాలని తెలిపారు.విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఆయన, కేజీబీవీలను రాష్ట్రంలో ఉత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బాలికల సమగ్ర అభివృద్ధి కోసం కేజీబీవీల ద్వారా విస్తృతంగా నిధులు వెచ్చిస్తున్నందున, వాటి వినియోగంలో పారదర్శకత, నిబద్ధత అవసరమని పేర్కొన్నారు.కేజీబీవీలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై ఆర్జేడీ ఎం. సోమిరెడ్డి సమగ్ర విచారణ నిర్వహించారు. ఆయన వెంట జిసిడిఓ శోభారాణి, కేజీబీవీ ఎస్ఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ఫలితాల్లో మెరిసిన చైతన్య విశ్వభారతి విద్యార్థి...




పెద్దపల్లిటౌన్//**మార్చి 18 (ఆకాంక్ష) :** నవోదయ విద్యాలయ సమితి 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ప్రవేశ పరీక్షల ఫలితాలను మంగళవారం అధికారికంగా విడుదల చేసింది. ఈ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లా ప్రతిభను చాటుతూ హనుమంతునిపేట గ్రామానికి చెందిన గన్నబోయిన శ్రీ వాత్సవ జిల్లా స్థాయిలో 10వ ర్యాంకు సాధించి విశేష ప్రతిభ కనబర్చాడు.సాధారణ కుటుంబానికి చెందిన శ్రీ వాత్సవ తన కృషి, పట్టుదలతో ఈ విజయాన్ని సాధించడం పట్ల గ్రామస్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ విజయంతో విద్యార్థి భవిష్యత్తుకు బలమైన పునాది పడిందని విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు.అత్యుత్తమ ర్యాంకు సాధించిన శ్రీ వాత్సవను చైతన్య విద్యా భారతి హై స్కూల్ యాజమాన్యం ఘనంగా అభినందించింది. పాఠశాల కరస్పాండెంట్ తిరునహరి లక్ష్మణస్వామి, ప్రిన్సిపల్ జ్యోతి, ఉపాధ్యాయ బృందం విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన శ్రమ, సరైన మార్గదర్శకత్వం ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలరని ఈ ఫలితాలు నిరూపించాయని తెలిపారు.

## అందుబాటులోకి ఎల్‌పీజీ సిలిండర్లు...

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం...



పెద్దపల్లిటౌన్//**మార్చి 18 (ఆకాంక్ష) :** జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ మేరకు వివరించారు. గత రెండు రోజులుగా జిల్లాలో సాధారణ స్థాయితో పోలిస్తే సుమారు 40 శాతం అధికంగా గ్యాస్ సిలిండర్ బుకింగ్‌లు నమోదవుతున్నాయని, ఇది ప్రజల్లో ఉన్న అనవసర భయాందోళనల ఫలితమని ఆయన పేర్కొన్నారు.ప్రజలు అటువంటి వదంతులను నమ్మకుండా అవసరానికి మించి బుకింగ్‌లు చేయవద్దని కలెక్టర్ సూచించారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ సరఫరా సక్రమంగా కొనసాగుతోందని, బుకింగ్ చేసిన 3 నుంచి 4 రోజులలోపే డెలివరీ అందిస్తున్నామని తెలిపారు. ఎలాంటి కొరత లేదని, గ్యాస్ నిల్వల పరిస్థితిని జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.ఎల్‌పీజీ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించి కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఇప్పటి వరకు 12 కేసులు నమోదు చేసి 29 సిలిండర్లను సీజ్ చేసినట్లు తెలిపారు.జిల్లాలో 15 డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందని, డెలివరీలో ఏవైనా సమస్యలు తలెత్తినట్లయితే జిల్లా కంట్రోల్ రూమ్ హెల్ప్‌లైన్ నంబర్ 08728-224045ను సంప్రదించాలని సూచించారు.గృహ అవసరాల కోసం సరఫరా చేసే ఎల్‌పీజీ సిలిండర్లను ఆర్డీఓలు, తహసీల్దార్లు, సివిల్ సప్లై అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గృహ వినియోగంతో పాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ సంస్థలకు సరఫరా కొనసాగించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రజలు వదంతులను నమ్మి ఆందోళన చెందకుండా సాధారణంగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## గత ప్రభుత్వ చెక్ డ్యాంలపై తీవ్ర విమర్శలు...

### కమిషన్ల కోసమే నిర్మాణాలు...

### ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు...



పెద్దపల్లిటౌన్//**మార్చి 18 (ఆకాంక్ష) :** తెలంగాణ రాష్ట్రంలో మాట ఇచ్చి తప్పని ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు స్పష్టం చేశారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వ పాలనలో జరిగిన లోపాలను తీవ్రంగా ఎండగట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 2014 నుండి 2023 వరకు నిర్మించిన చెక్ డ్యాంలన్నీ నాసిరకం పనులతో జరిగాయని ఎమ్మెల్యే ఆరోపించారు. కేవలం కమిషన్ల కోసం ఈ నిర్మాణాలు చేపట్టారని, ఇసుక దోపిడీకి అవే ప్రధాన కేంద్రాలుగా మారాయని విమర్శించారు. ఎండాకాలంలో నిర్మించిన చెక్ డ్యాంలు వర్షాకాలం రాగానే కొట్టుకుపోయాయని, మానేరు నదిపై నిర్మించిన చెక్ డ్యాంల పరిస్థితి మరింత దారుణంగా ఉందని అన్నారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని గత ప్రభుత్వం వృథా చేసిందని మండిపడ్డారు.రైతు సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న ఆయన, గతంలో కేసీఆర్ ఎన్నికల ముందు బోనస్ ఇస్తామని చెప్పి అమలు చేయలేదని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం సన్న వడ్లకు రూ.155 కోట్ల బోనస్ అందించి తన నిబద్ధతను చాటుకుందని తెలిపారు. గతంలో రేషన్ బియ్యం వ్యవహారంలో రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రీసైక్లింగ్ చేసిన ఘటనలు జరిగినట్టు విమర్శించారు.ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కూడా గత ప్రభుత్వం కాలయాపన మాత్రమే చేసిందని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి నిరుపేదకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పార్టీలకు అతీతంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం మొత్తం రూ.22,500 కోట్ల నిధులు వెచ్చిస్తోందని వివరించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజలో ఉందని, రాష్ట్ర అభివృద్ధి మరియు సంక్షేమం లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే విజయ రమణారావు తెలిపారు.

## నాణ్యమైన ధాన్యం కొనుగోలుకు పక్కా ప్రణాళిక సిద్ధం...

### పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...



పెద్దపల్లి//**మార్చి 18 (ఆకాంక్ష) :** యాసంగి సీజన్‌లో నాణ్యమైన ధాన్యం కొనుగోలు కోసం సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.యాసంగి 2025-26 సీజన్‌కు సంబంధించి సుమారు 4 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లాలోని 334 కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు అవసరమైన కోటి 12 లక్షల 59 వేల గన్నీ సంచులను ముందస్తుగా సిద్ధం చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) పురోగతిపై మాట్లాడుతూ, 2024-25 వానాకాలానికి సంబంధించి 100 శాతం, యాసంగికి సంబంధించి 93 శాతం, 2025-26 వానాకాలానికి సంబంధించి 28 శాతం సీఎంఆర్ పూర్తి అయినట్లు తెలిపారు. 2014-15 నుండి 2023-24 వరకు సీఎంఆర్ బకాయిలు ఉన్న 48 రైస్ మిల్లులను గుర్తించి, గత పది రోజుల్లోనే డిఫాల్ట్ మిల్లర్ల నుండి రూ.2 కోట్ల 18 లక్షలు వసూలు చేసినట్లు వెల్లడించారు.పెండింగ్ బాకాయిలను వెంటనే చెల్లించాలని డిఫాల్ట్ రైస్ మిల్లర్లను హెచ్చరించిన కలెక్టర్, చెల్లింపులు చేయని పక్షంలో కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఐదు రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రెవెన్యూ రికవరీ చట్టాన్ని అమలు చేసినట్లు తెలిపారు. మిగిలిన మిల్లులపై కూడా తనిఖీలు నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కే. శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎం. శ్రీకాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో

## ఘనంగా ఉగాది వేడుకలు...



నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 18 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. తెలుగువారి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అధ్యాపకుల సమక్షంలో ఉత్సాహభరితంగా వేడుకలు జరిపారు.కళాశాల ప్రాంగణాన్ని సంప్రదాయ శైలిలో అలంకరించి, ఉగాది పచ్చడిని తయారు చేసి పండుగ ప్రత్యేకతను ప్రతిబింబించారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తూ సందడి చేశారు. సంప్రదాయ వేషధారణతో వేడుకలకు మరింత శోభ తీసుకొచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మదన్ మోహన్, ఏవో మొహమ్మద్ ఇర్ఫాన్, అధ్యాపకులు అంజయ్య, వనిత, ఉమాదేవి, కోదండరాములు, రామకృష్ణ, దశరథం, ముజఫర్, రాఘవేందర్, నరేష్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

### గాయత్రి విద్యానికేతన్‌లో

## ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహణ...



పెద్దపల్లిటౌన్//**మార్చి 18 (ఆకాంక్ష) :** తెలుగు నూతన సంవత్సర పండుగ 'ఉగాది'ను పురస్కరించుకొని పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో బుధవారం ముందస్తు ఉగాది వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం అంతా పండుగ శోభను తలపిస్తూ తోరణాలు, అలంకరణలతో సుందరంగా ముస్తాబు చేయబడింది. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులు విద్యార్థులకు ఉగాది పండుగ



ప్రాముఖ్యతను విశదీకరించారు. ఉగాది నూతన సంవత్సరానికి ఆరంభమని, ప్రకృతి మార్పులు మరియు కాలచక్రంలోని పరిణామాలకు అనుగుణంగా ఈ పండుగను జరుపుకుంటామని వివరించారు. ముఖ్యంగా షడ్రుచులతో తయారయ్యే ఉగాది పచ్చడి జీవితం లోని ఆనందం, దుఃఖం, కోపం, ఆశ్చర్యం వంటి భావోద్వేగాల సమ్మేళనానికి ప్రతీకగా ఉంటుందని పిల్లలకు అర్థమయ్యేలా తెలియజేశారు.అనంతరం విద్యార్థుల చేతనే ఉగాది పచ్చడిని తయారు చేయించి, అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించింది. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ఉగాది పాటలు, భక్తి గీతాలకు నృత్య ప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులను అలరించారు. సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ చేసిన ఈ ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ వేడుకల్లో పాఠశాల చైర్మన్ శ్రీనివాస్,కరస్పాండెంట్ రజిని, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని యాజమాన్యం తెలిపింది.

## హీరో సుమన్‌ను కలిసిన గౌడ సంఘం సభ్యులు...



నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 18 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ నియోజకవర్గ గౌడ సంఘం సభ్యులు ప్రముఖ సినీ నటుడు తల్వార్ సుమన్ గౌడ్‌ను కరీంనగర్‌లో జరుగుతున్న సినిమా షూటింగ్ సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్‌లో త్వరలో నిర్వహించనున్న గౌడ ప్రజా ప్రతినిధుల సత్కార సభకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజినేపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, సంఘ అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ గౌడ్ తదితర గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి సేవలను ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలి...

### ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు...

### వైద్య సేవలపై సిబ్బందికి ప్రశంసలు...

### పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...



పెద్దపల్లిటౌన్//**మార్చి 18 (ఆకాంక్ష) :** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.బుధవారం పెద్దపల్లి పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని మాతా-శిశు విభాగం, రేడియాలజీ, గైనకాలజీ, లేబర్ రూమ్, ఆప్తామాలజీ,ఆర్థోపెడిక్స్, ఫార్మసీ తదితర విభాగాలను పరిశీలించారు.గర్భిణీ స్త్రీలకు సమయానికి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఈడీడీ క్యాలెండర్ ద్వారా ప్రసవ సమయం దగ్గరలో ఉన్న మహిళలను గుర్తించి హెల్ప్‌డెస్క్ ద్వారా ముందస్తు సమాచారాన్ని అందించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ పాటించాలని, సెలవులు తీసుకునే ముందు తప్పనిసరిగా సూపరింటెండెంట్ అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. యూఎస్‌జీ, టిఫా స్కానింగ్, ఓపీ సేవలపై వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. లేబర్ రూమ్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మాతా-శిశు వార్డుల్లో రోగులతో మాట్లాడి మందులు సమయానికి అందుతున్నాయా, నర్సింగ్ సిబ్బంది సేవలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. రోగుల నుంచి వచ్చిన సానుకూల స్పందనపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఆప్తామాలజీ విభాగంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫాకో యంత్రం పనితీరును పరిశీలించి, ఈ సదుపాయాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఆర్థోపెడిక్స్ విభాగంలో నెలకు 60 నుంచి 70 వరకు శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఫార్మసీ విభాగంలో మందుల నిల్వ, పంపిణీ విధానంపై ఆరా తీశారు. స్టాక్‌ను క్రమబద్ధంగా నిర్వహిస్తున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు.రోగుల కోసం వెయిటింగ్ ఏరియాలో కూర్చునే సౌకర్యాన్ని పెంచాలని, వ్యక్తిగత వస్తువులు భద్రపరుచుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆర్ఎంఓకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంఓ డాక్టర్ విజయకుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ సాయి ప్రసాద్ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్నేహానికి, సోదరభావానికి వేదికైన ఇఫ్తార్...

### మిడ్జిల్‌లో వెల్లివిరిసిన ఐక్యత...



జడ్చర్ల//**మార్చి 18 (ఆకాంక్ష) :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మిడ్జిల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు స్నేహానికి, సోదరభావానికి ప్రతీకగా నిలిచింది. గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్ చొరవతో ఘనంగా ఏర్పాటు చేసిన ఈ విందులో ముస్లిం సోదరులతో పాటు వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మత సామరస్యాన్ని చాటారు. రంజాన్ మాసంలో తెల్లవారుజామున సహర్ నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండే ముస్లింలు, ఆకలి విలువను తెలుసుకోవడం, మనసు శరీరంపై నియంత్రణ సాధించడం, అల్లాహ్ పట్ల భక్తిని పెంపొందించుకోవడమే ప్రధాన లక్ష్యంగా భావిస్తారు. ఈ సందర్భంగా ఖురాన్ పఠనానికి ప్రాధాన్యత ఇచ్చి, దానం (జకాత్) ద్వారా పేదలకు సహాయం చేస్తారు. గత తప్పులను గుర్తించి క్షమాపణ కోరుతూ, మంచి ఆలోచనలతో జీవించేందుకు ఈ నెలను పవిత్రంగా భావిస్తారు.ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం గంగా-జమునా తెహజీబ్ సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచింది. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి భోజనం చేయడం ద్వారా ప్రేమ, ఐక్యతను పెంపొందించే వేదికగా ఈ కార్యక్రమం నిలిచింది.ఈ వేడుకకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తంగెళ్ల ఆల్వాల్ రెడ్డి, ప్రముఖ నాయకులు బరిగేల వెంకటయ్య ముఖ్య అతిథులుగా హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పరమత సహనం ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని, పండుగలు మనుషుల మధ్య దూరాలను తగ్గించి స్నేహబంధాలను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, గ్రామాభివృద్ధి కోసం ప్రార్థించారు. వివిధ వార్డుల సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ముస్లిం యువకులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ముస్లిం సోదరులతో కలిసి కూర్చొని విందు ఆరగించడం ద్వారా మత సామరస్యాన్ని చాటిన ఈ ఇఫ్తార్ వేడుక, గ్రామంలో ఐక్యతను మరింత బలోపేతం చేసిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం చివరలో ముస్లిం పెద్దలు అతిథులను సాదరంగా గౌరవించి ఆశీస్సులు అందజేశారు.

## కిమ్ క్లీన్ స్వీప్- ఉత్తర కొరియా ఎన్నికల్లో 99.93 శాతం ఓట్లతో విక్టరీ

### ఎన్నికల్లో అత్యధికంగా 99.99 శాతం పోలింగ్



ఉత్తర కొరియా పార్లమెంటరీ ఎన్నికల్లో ఆ దేశ నియంత కిమ్ జోంగ్ ఉన్ తిరుగులేని మెజారిటీతో గెలిచారు. ఆయన సారథ్యంలోని వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా, దాని మిత్రపక్షాలు మార్చి 15న జరిగిన ఎన్నికల్లో అన్ని సీట్లలోనూ ఏకంగా 99.93 శాతం ఓట్లను సాధించాయి. దేశంలోని కేవలం 0.07 శాతం మంది ప్రజలే అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓట్లు వేశారు. ఓటర్లకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను ఇస్తున్నామనే ప్రచారం చేసుకునేందుకే ఈ అవకాశాన్ని ఓటర్లకు కిమ్ జోంగ్ ఉన్ ఇస్తున్నారని అంటున్నారు. మొత్తంమీద ఈ ఎన్నికల్లో అత్యధికంగా 99.99 శాతం పోలింగ్ నమోదైంది. ఈ పార్టీలకు చెందిన 687 మంది ఉత్తర కొరియా సుప్రీం పీపుల్స్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఉత్తర కొరియా 15వ పార్లమెంటరీ ఎన్నికల ఫలితాల సమాచారంతో ఈమేరకు ఆ దేశ మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈనేపథ్యంలో తదుపరిగా నూతన సభ్యులతో సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ సమావేశమై, కిమ్‌ను మళ్లీ దేశ అధ్యక్షుడిగా ఎన్నుకునే అంశంపై ప్రకటన చేయనుంది. రాజ్యాంగంలో చేయాల్సిన కీలక సవరణలపై ఈ సభ చర్చించనుంది.

మళ్లీ దేశ అధ్యక్షుడిగా కిమ్

కిమ్ జోంగ్ ఉన్ మళ్లీ దేశ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ లాంఛనంగా ఒక ప్రకటన విడుదల చేయనుంది. ఫిబ్రవరి నెలలో జరిగిన అధికార వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా 9వ సమావేశంలో చేసిన తీర్మానాల ప్రకారం, రాజ్యాంగ సవరణలకు కసరత్తును మొదలుపెట్టనుంది. అధికారికంగా దక్షిణ కొరియాను తమ శత్రుదేశంగా ప్రకటించాలని కిమ్ జోంగ్ ఉన్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు రాజ్యాంగంలో సవరణలు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అధికార వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా వ్యవస్థాపక పత్రంలో ఉత్తర కొరియా, దక్షిణ కొరియాలు శత్రుదేశాలనే అంశం ఉందనే విషయాన్ని పరిశీలకులు గుర్తుచేస్తున్నారు. ఫిబ్రవరి నెలలో జరిగిన అధికార వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా 9వ సమావేశంలోనూ దీనిపై ప్రత్యేక తీర్మానాలు చేశారు. పార్టీ ఛార్టర్‌లో మార్పులు,చేర్పులు చేశారు.

దక్షిణ కొరియాపై కిమ్ ప్రకటన

దక్షిణ కొరియా తమకు శత్రుదేశమని 2024లోనే అధికారికంగా కిమ్ ప్రకటించారు. అయితే ఈ ప్రకటనకు రాజ్యాంగబద్ధత, చట్టపరమైన ఆమోదాన్ని కల్పించే దిశగా ఉత్తర కొరియా సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ అడుగులు వేయనున్నట్లు తెలుస్తోంది. దీనిపై కిమ్ జోంగ్ ఉన్ చేసే అధికారిక ప్రకటన కోసం దక్షిణ కొరియా సహా ఇతర ఇరుగుపొరుగు దేశాలన్నీ ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. ఉత్తర కొరియా అంతర్జాతీయ సంబంధాలు, శత్రుదేశాలు, మిత్రదేశాలపై ఆయన చేయనున్న ప్రకటనపై ఉత్కంఠ నెలకొంది.

రబ్బరు స్టాంపు ఉత్తర కొరియా అసెంబ్లీ

కిమ్ జోంగ్ ఉన్ కనుసన్నల్లోనే పనిచేస్తుండటంతో ఉత్తర కొరియా సుప్రీం పీపుల్స్ అసెంబ్లీని రబ్బరు స్టాంపు లాంటిదని చెబుతుంటారు. వాస్తవానికి దేశంతో ముడిపడిన అన్ని చట్టాలను రూపొందించే, ఆమోదించే అధికారాలు ఈ సభకు ఉన్నాయి. అయితే ఈ నిర్ణయాలన్నీ కిమ్ ఆధ్వర్యంలో నడిచే వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా సిద్ధాంతాల ప్రకారమే జరుగుతుంటాయి.

ప్రజాప్రతినిధుల్లో 70 శాతం మంది కొత్తవాళ్లే

ఉత్తర కొరియా ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే, దాదాపు 70 శాతం మంది పాత ప్రజాప్రతినిధుల స్థానంలో కొత్తవారు ఎన్నికయ్యారు. కిమ్ జోంగ్ ఉన్ అధికార పీఠానికి మరింత బలాన్ని చేకూర్చేందుకే, బలమైన ప్రజాప్రతినిధులు తయారుకాకుండా అడ్డుకునేందుకే ఇంతగా మార్పులు చేశారని పరిశీలకులు అంటున్నారు. సుప్రీం పీపుల్స్ అసెంబ్లీకి ఎన్నికైన 687 మందిలో జో యోంగ్ వన్, కిమ్‌కు అత్యంత సన్నిహితుడు. సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ పదవిని ఈయనకే కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది. గతంలో సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించిన చోయీ ర్యోంగ్ హయీకి ఈ ఎన్నికల్లో పోటీచేసే అవకాశాన్ని ఇవ్వలేదని సమాచారం. కొత్త ఎంపీల జాబితాలో కిమ్ సోదరి కిమ్ యో జాంగ్, విదేశాంగ మంత్రి చోయీ సన్ హుయీ కూడా ఉన్నారు. వీళ్లంతా కార్మిక వర్గాలు, రైతు వర్గాలు, అధికార వర్గాల నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారని ఉత్తర

## దేశంలోనే తొలి ఏటీఎం- 24×7 అందుబాటులో- నిమిషాల్లోనే సిలిండర్!

### భారత్ గ్యాస్ వినూత్న ఆలోచన- దేశంలోనే తొలి ఎల్ పీజీ ఏటీఎం- నిమిషాల్లోనే సిలిండర్ పొందవచ్చు!




భారత్ లో ప్రస్తుతం ఎక్కడ చూసినా ఎల్ పీజీ గ్యాస్ గురించే చర్చ నడుస్తుంది. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో దేశంలో ఎల్ పీజీ కొరత భయాలు ఏర్పడ్డాయి. దీంతో గతకొద్ది రోజులుగా భారీ ఎత్తున ఎల్ పీజీ బుకింగ్స్ జరుగుతున్నాయి. సిలిండర్ కోసం సంబంధిత ఎజెన్సీ వద్ద జనాలు బారులు తీరుతున్నారు. కానీ, ఓ చోట సిలిండర్ ఏటీఎమ్ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ ఏటీఎంను ఉపయోగించి వినియోగదారులు సిలిండర్ ను పొందుతున్నారు. ఏటీఎంలో సిలిండర్ రావడం ఏంటి అని అనుకుంటున్నారా? అవును ఇది నిజమే! మరి ఇది ఎక్కడ ఉంది? ఎలా పని చేస్తుందో తెలుసుకుందాం! సాధారణంగా ఏటీఎం అనగానే అందరికీ డబ్బులు విత్ డ్రా చేసుకునే మిషన్ మాత్రమే గుర్తొస్తుంది. ఈమధ్య కాలంలో అక్కడక్కడా బంగారం అందించే ఏటీఎంలు కూడా పుట్టుకొస్తున్నాయి. అయితే వీటికి భిన్నంగా హరియాణాలోని గురుగ్రామ్ లో ఎల్ పీజీ సిలిండర్ ఏర్పాటు చేశారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (ధీజూ) గురుగ్రామ్ సోహ్నలోని సెంట్రల్ పార్క్ ఫ్లవర్ వ్యాలీ సొసైటీలో గతేడాది పైలట్ ప్రాజెక్ట్ కింద ఈ మిషన్ ను ఏర్పాటు చేసింది. ఇది ఏఐ ఆధారిత మిషన్. వినియోగదారులకు సౌకర్యవంతమైన, నిరంతరాయంగా 24 గంటల గ్యాస్ సరఫరాను అందించడమే లక్ష్యంగా భారత్ గ్యాస్ ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

సంప్రదాయ సిలిండర్లకు భిన్నంగా!

సాధారణంగా గృహ అవసరాలకు ఉపయోగించే సిలిండర్ లోహంతో తయారై ఉంటుంది. ఇందులో 14.2 కిలోల గ్యాస్ ఉంటుంది. మొత్తం సిలిండర్ బరువు 31 కిలోల దాకా ఉంటుంది. వీటితో పోలిస్తే ఈ ఏటీఎంలో లభ్యమయ్యే సిలిండర్లు చిన్నవిగా, తేలికగా ఉంటాయి. ఇవి ఫైబర్ తో తయారు చేసిన సిలిండర్లు. దీంతో ఇవి ఎన్నేళ్లైనా తుప్పు పట్టవు. అలాగే గ్యాస్ తో కలిపి వీటి బరువు 15 కిలోలు మాత్రమే ఉంటుంది. పూర్తిగా గృహ అవసరాలకు వినియోగించుకునేలా ఉంటుంది. అయితే స్థానికంగా భారత్‌గ్యాస్ కనెక్షన్ ఉన్న వినియోగదారులకు మాత్రమే ఈ సదుపాయాన్ని వినియోగించుకనే అవకాశం ఉన్నట్లు భోండ్సీ భారత్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ బీరేంద్ర సింగ్ 'ఈటీవీ భారత్ 'తో చెప్పారు.

టీఎమ్ నుంచి సిలిండర్ ఎలా పొందాలంటే వినియోగదారులు తమ రిజిస్ట్రేషన్ మొబైల్ నెంబర్‌తో ఎల్ పీజీ గ్యాస్ ఏటీఎం మిషన్‌లో లాగిన్ అవ్వాలి తమ రిజిస్టర్ ఫోన్ నెంబర్‌కు వచ్చిన ఫ్రూని ఎంటర్ చేయాలి అనంతరం డిస్ ప్లేపైన క్యూఆర్ (ఙ=) కోడ్ వస్తుంది. అది స్కాన్ చేసి డబ్బులు చెల్లించాలి. లేదంటే డెబిట్ కార్డుతోనూ పెమెంట్ చేయవచ్చు పేమెంట్ పూర్తైన తర్వాత ఏటీఎం డోర్ నుంచి గ్యాస్ సిలిండర్ బయటకు వస్తుంది. మన ఖాళీ సిలిండర్‌ను మెషిన్ ఉంచి, కొత్త సిలిండర్ తీసుకోవాలి స్థానికుల హర్షం భారత్ గ్యాస్ చేసిన ఈ వినూత్న ఆలోచనను స్థానికులు స్వాగతిస్తున్నారు. వాళ్లు ఈటీవీ భారత్‌తో మాట్లాడుతూ, ఇది తమకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. తమ సిలిండర్లను రీఫిల్ చేయించుకోవడానికి డెలివరీ వాహనం కోసం వేచి ఉండాల్సిన అవసరం గానీ, పని కట్టుకుని ఏజెన్సీకి వెళ్లాల్సిన అవసరం గానీ లేదని పేర్కొన్నారు. దీనివల్ల ఎల్ పీజీ లభ్యతకు సంబంధించిన సమస్యలు కొంతమేర తగ్గుతాయని భావిస్తున్నట్లు చెప్పారు.

త్వరలోనే దేశమంతా!

ఈ ఎల్‌పీజీ ఏటీఎం 24గంటలు అందుబాటులో ఉంటుంది. ఎప్పుడైనా నిమిషాల్లోనే మెషిన్ నుంచి సిలిండర్ల పొందవచ్చు. ఇందులో ఒకేసారి 10 సిలిండర్లను నిల్వ చేసే సామర్థ్యం ఉంటుంది. ఏటీఎంలో నుంచి నిల్వ తగ్గినప్పుడల్లా సంబంధింత ఏజెన్సీకి ఆటోమెటిక్ గా మెసెజ్ వెళ్తుంది. దీంతో సిబ్బంది మళ్లీ సిలిండర్లను మెషిన్ లో నింపుతారు. వినియోగదారులకు సౌకర్యవంతమైన, వేగవంతమైన, సురక్షితమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ఏటీఎం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు బీపీసీఎల్ వెల్లడించింది. అక్కడ ఈ ప్రయోగం సక్సెస్ అయితే ఈ గ్యాస్ ఏటీఎంలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకువస్తామని భారత్ గ్యాస్ తెలిపింది.